# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

10.2.2026 మంగళవారం Tuesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 210 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789




ఆ రెండు పార్టీలకు

## ఓటేస్తే..

- రాష్ట్రం మరో బంగ్లాదేశ్
- రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

3

# మున్సిపల్ ఎన్నికలకు మోడీకి సంబంధమేమిటీ?

- పట్టణాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యం
- 12 ఏళ్ల బీజేపీ పాలన, పదేళ్ల బీఆర్ఎస్ పాలన చూడండి
- అనేక పథకాలతో అభివృద్ధి, సంక్షేమాన్ని చేపట్టాం
- తెలంగాణ రూపాయి ఇస్తే.. 42 పైసలే వాపస్ వస్తున్నాయి
- ఉత్తరాది బీహార్, యూపిలతో పోలిస్తే దారుణమైన పరిస్థితి
- దక్షిణాది రాష్ట్రాలపై కక్షగట్టిన ప్రధాని మోడీ
- దక్షిణాది సొమ్ముతో ఉత్తరాది రాష్ట్రాలకు సోకు
- ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఏం చేస్తున్నట్లు
- మీడియా సమావేశంలో గణాంకాలతో వెల్లడించిన సీఎం రేవంత్ రెడ్డి

## రెండేళ్ల అభివృద్ధిని చూసి ఓటేయండి



**హైదరాబాద్, ఫిబ్రవరి 9:** మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు ఓటేయాలని, దీంతో మున్సిపాలిటీల్లో అభివృ ద్ధికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, 12 ఏళ్ల మోడీ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకుని అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసిన వేళ సీఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల కు మోడీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మోడీ ము ఖం చూసి ఓటేయమని బీజేపీ అడగడాన్ని ఎద్దేవా చేశారు. బీజేపీ అధ్యక్షుడు ప్రచారంలో పాల్గొన్నా రాష్ట్రానికి ఒక్క పైసా ఉపయోగం లేదన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తూ భారీగా పన్ను లు చెల్లిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి దక్కాల్సిన వాటాలో తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

మిగతా 3 లో




## సైలెన్స్‌ప్లీజ్

### మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వం సమాప్తం

- 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో హోరెత్తిన ప్రచారం
- రేపటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. సోమవారం ప్రచార గడువు ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా మైకులు మూగబోయాయి. 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు ఈ నెల 11వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. మొత్తం 12,930 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 52.50 లక్షలమంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల కోసం 8,203 పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. ఈ నెల 13న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

3





సీఎం ఎవరైనా సరే

## ఎంఐఎం దగ్గరకి రావాల్సిందే..

- మేమే లేకపోతే జూబ్లీహిల్స్ గెలిచేవారా?
- ఎంఐఎం భయానికి ముస్లింలకు బీజేపీ టికెట్లు
- కరీంనగర్‌లో అక్బరుద్దీన్ ఒవైసి సంచలన వ్యాఖ్యలు

2

## ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగాలి

- ప్రతి ఒక్కరూ ఓటేసేలా చూసుకోవాలి
- పార్టీ నేతలకు రేవంత్ దిశానిర్దేశం

3

జీహెచ్ఎంసీ పదవీకాలం

## సమాప్తం

- మేయర్ విజయలక్ష్మికి సన్మానం



3

దేశంలోనే అతిపెద్ద నగరపాలక సంస్థ జీహెచ్ఎంసీకి మేయర్‌గా పని చేయడం గర్వంగా ఉందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. తన పదవీ కాలంలో కమిషనర్, అధికారులు అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు , కార్పొరేటర్లు, అధికారుల సమష్టి కృషితో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించగలిగామని తెలిపారు. తనకు సహకరించిన కార్పొరేటర్లు, అధికారులకు మేయర్ ధన్యవాదాలు తెలిపారు.

## ఓటకు నోటు సాక్ష్యాలు దగ్ధం

- ఫోరెన్సిక్ అగ్నిప్రమాదం ఓ కుట్ర
- సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఆరోపణలు

2





3

కాంగ్రెస్‌కు కాదు..

## బీఆర్ఎస్‌కు ఓటేయండి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్

మున్సిపల్ ఎన్నికల వేళ పటాన్‌చెరు కాంగ్రెస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.



రేవంత్ రెడ్డి జైలుకెళ్లడం

## ఖాయం

- అందుకే ఓటుకునోటు ఫైలళ్లు దగ్ధం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపణ

2

ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి నిప్పులు చెరిగారు.

రాష్ట్రంలో పెరిగిన అత్యాచారాలు,

## హత్యలు

మున్సిపల్ ఎన్నికల తర్వాత పన్నుపోటు

సీఎం రేవంత్‌పై ఎంపీ డీకే అరుణ ఆరోపణలు

2



## స్పీకర్ తీరుపై విపక్షాల ఆగ్రహం

- అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే యోచన
- ఖర్గేతో వివిధ పక్షాల నేతల భేటీలో చర్చ




4

## సర్ ప్రక్రియను అడ్డుకోవద్దు

- బెంగాల్ సర్ ప్రక్రియపై సుప్రీం ఆదేశం

బెంగాల్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. 'సర్' ప్రక్రియకు అడ్డంకులు కల్పించే ఎలాంటి ప్రయత్నాలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. ఏదైనా బెటర్‌మెంట్ చేయాల్సిన అవసరం వచ్చినట్లయితే తామే కల్పించుకుంటామని తెలిపింది. పశ్చిమబెంగాల్‌లో 'సర్' పక్రియను ఫిబ్రవరి 14 నుంచి 21వ తేదీ వరకూ మరో వారం పొడిగిస్తున్నట్టు పేర్కొంది.

4



# పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

మొదటి పేజీ తరువాయి



దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తూ ఉత్తరాది రాష్ట్రాలకు కేంద్రం పెద్దపీట వేస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా పన్నుల పునఃపంపిణీలో కేంద్రం అనుసరిస్తున్న తీరును ఆయన గణాంకాలతో సహా ఎండగట్టారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళున్న ప్రతి రూపాయికి ప్రతిఫలంగా రాష్ట్రానికి కేవలం 42 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని, ఇది రాష్ట్ర ప్రయోజనాలపై గొడ్డలి పెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర పన్నుల వాటా పంపిణీలో ఉత్తరాది రాష్ట్రాలకు అందుతున్న నిధులపై సీఎం రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. తెలంగాణ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రానికి నుంచి నిధులను సేకరించి, ఇతర రాష్ట్రాలకు కట్టబెడుతున్నారని ఆయన విమర్శించారు. ఉత్తరప్రదేశ్ రూపాయి పన్ను చెల్లిస్తే కేంద్రం ఆ రాష్ట్రానికి 2 రూపాయలు తిరిగి ఇస్తోందని, ఇక బీహార్ విషయానికొస్తే రూపాయికి బదులుగా ఏకంగా 6 రూపాయలు నిధులుగా వెళ్తున్నాయని ఆయన వివరించారు. ఈ స్థాయి వివక్షపై తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా పార్లమెంట్‌లో నోరు మెదిపారా అని ఆయన నిలదీశారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపించినందుకు తెలంగాణకు మీరు చేసిన మేలేమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పైకి విమర్శలు చేసుకుంటున్నప్పటికీ, లోపల మాత్రం ఆ రెండు పార్టీలు ఒక్కటేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన వివాదాస్పద రైతు వ్యతిరేక చట్టాలకు బీఆర్ఎస్ బేషరతుగా మద్దతు తెలిపిందని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా, నోట్ల రద్దు సమయంలో కేసీఆర్ అసెంబ్లీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి మరీ ప్రధాని మోదీని అభినందించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మోదీ ప్రేమలో అమరత్వం పొందుతానని గతంలో కేసీఆర్ చెప్పలేదా అని ఆయన ఎద్దేవా చేశారు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగినట్లుగా వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం బయటపడదని అనుకుంటున్నారని, కానీ బీఆర్ఎస్ , బీజేపీ మధ్య పక్కాగా 'క్విడ్ ప్రో కో' ఒప్పందం నడుస్తోందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అత్యంత ఖరీదైన ఫార్ములా–ఈ కారు రేస్ అక్రమాలకు సంబంధించిన ఫైల్స్ ఈడీ వద్ద ఉన్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేసినా కేంద్రం ఉదాసీనంగా వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేమిటని అడిగారు. బీఆర్ఎస్ నాయకులను కాపాడేందుకే బీజేపీ ఈ కేసులను అటకెక్కించిందని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం తన ప్రభుత్వం పోరాటం కొనసాగిస్తుందని, కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి పైసాను సాధించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తును ఆలోచించుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న భాజపా.. తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా? అని ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని ప్రధాని మోదీనే స్వయంగా హామీ ఇచ్చారు. వాటి గురించి చెప్పట్లేదు.. కానీ, మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. వరదల్లో నీటమునిగిన వస్తువులన్నీ కేంద్రం నుంచి నిధులు తెచ్చి తిరిగిస్తామని గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్మి ఆ పార్టీకి చెందిన 50 మందిని కార్పొరేటర్లుగా గెలిపించారు. ఎన్నికలయ్యాక అడిగితే.. వస్తువులకు బీమా ఉంటుందని బండి సంజయ్ మాటమార్చారు. తెలంగాణకు రూ.లక్షల కోట్లు ఇచ్చామని భాజపా నేతలు చెబుతున్నారు. దీనిపై సీఎస్‌ను వివరణ అడిగితే.. మనం రూపాయి చెల్లిస్తే.. కేంద్రం 42 పైసలు ఇస్తోందని చెప్పారు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయి. తెలంగాణకు వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన సెమీకండక్టర్ ప్రాజెక్టును మోదీ ఒత్తిడి చేసి.. ఏపీకి తరలించారు. ఇప్పుడు మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. అసలు మున్సిపల్ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధం? భాజపా నేతలకు దేవుడు అసదుద్దీన్ ఒవైసీ. ఆయన పేరు లేకుండా ఆ నేతల ప్రచారం ఉండదు. మత రాజకీయాల ద్వారా భాజపా రాజకీయ మనుగడ సాగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇకపోతే తెలంగాణ కోరిన మూసీ రివర్ ఫ్రంట్, ట్రిపుల్ ఆర్, మెట్రో విస్తరణ వంటి పథకాలపై ఎలాంటి కదలిక లేదన్నారు. అయితే తెలంగాణ అభివృద్ధికి తాము రెండేళ్లలో అనేక పనులు చేపట్టామని అన్నారు.

# ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగాలి

- ప్రతి ఒక్కరూ ఓటేసేలా చూసుకోవాలి
- పార్టీ నేతలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం



**హైదరాబాద్, ఫిబ్రవరి 9:** మున్సిపల్ ఎన్నికల్లో నేతలు సమన్వయంతో ముందుకెళ్లాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎన్నికల ప్రచారం, ఇతర అంశాలపై కాంగ్రెస్ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులపై సీఎం రేవంత్ ఆరా తీశారు. బలహీనంగా ఉన్న మున్సిపాలిటీల్లో పోలింగ్ వ్యూహంపై చర్చించారు. స్థానిక నేతల నేతృత్వంలో పోల్ మేనేజ్‌మెంట్ జరిగేలా చూడాలని మంత్రులకు సూచించారు. ప్రతి ఓటరూ పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. ఇవాళ, రేపు ఓటర్లకు నేతలు అందుబాటులో ఉండాలని రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ప్రతి ఓటరు బూత్ దగ్గరకు చేరుకునేలా చూడాలన్నారు. ఏమరుపాటు పనికిరాదన్నారు. ప్రతి ఒక్కరూ ఓటేసేల చూడాలన్నారు.

# సైలెన్స్ ప్లీజ్

## మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వం సమాప్తం

## 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో హోరెత్తిన ప్రచారం

## 11న పోలింగ్‌కు సర్వం సిద్ధం




**హైదరాబాద్, ఫిబ్రవరి 9:** తెలంగాణ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ప్రచార పర్వం ముగిసింది. చివరి రోజున అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నుంచి మంత్రులు తమ ప్రాంతాల్లో ర్యాలీలు, సభలు నిర్వహించగా, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కూడా ప్రచారాన్ని ఉధృతం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో జరిగిన ఎన్నికల ప్రచారం ముగియడంతో ఇన్నాళ్లు మార్మోగిన వీధులు ఇప్పుడు నిశ్శబ్దంగా మారాయి. ఈ ఎన్నికలను అన్ని ప్రధాన పార్టీలు సెమీ ఫైనల్స్‌గా భావిస్తూ తీవ్రంగా ప్రచారం నిర్వహించాయి. అగ్రనేతల పర్యటనలు, భారీ రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారంతో రాజకీయ వేడి పెరిగింది. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌పై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 52,43,023 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 25,62,639 మంది పురుషులు, 26,80,014 మంది మహిళలు, అలాగే 640 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం ఈసారి ఎన్నికల్లో కీలక అంశంగా మారింది. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 8,195 పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల కోసం 16,031 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. పర్యవేక్షణ కోసం 1,379 రిటర్నింగ్ ఆఫీసర్లు, 1,547 సహాయ రిటర్నింగ్ ఆఫీసర్లు, 9,560 ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అలాగే 31,428 మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సుల భద్రత కోసం 137 స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపుకు 136 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 25,000 మంది పోలీసు సిబ్బందితో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలు మోహరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ సదుపాయం కల్పించి పారదర్శకతను నిర్ధారిస్తున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఫిబ్రవరి 11న పోలింగ్ అనంతరం ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. అనంతరం ఫిబ్రవరి 14న మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, డిప్యూటీ చైర్మన్ ఎన్నికలు, చివరగా ఫిబ్రవరి 16న ప్రమాణ స్వీకారం జరుగుతుంది.

# జీహెచ్ఎంసీ పదవీకాలం సమాప్తం

## మేయర్ విజయలక్ష్మికి సన్మానం

**హైదరాబాద్, ఫిబ్రవరి 9:** నగర కార్పొరేటర్లు, అధికారుల సమష్టి కృషితో ఐదేళ్లలో నగరాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. తన పదవి కాలంలో కమిషనర్, అధికారులు అందించిన సహకారాన్ని మరువలేనని చెప్పారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ చివరి సమావేశం నిర్వహించారు. ఎజెండా అంశాల్లోని 9 ప్రతిపాదనలకు, 11 అదనపు అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఇటీవల అహ్మదాబాద్, రాజ్‌కోట్ పురపాలక సంఘాల్లో మేయర్ ఆధ్వర్యంలో పర్యటించిన కార్పొరేటర్ల బృందం.. అక్కడ గుర్తించిన ఉత్తమ విధానాలతో కూడిన సమగ్ర అధ్యయన నివేదికను కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు అందజేసింది. స్టాండింగ్ కమిటీ ఆమోదించిన పనులు పూర్తి చేస్తామని కర్ణన్ తెలిపారు. కార్పొరేటర్లు లేవనెత్తిన ప్రజా సమస్యలను చాలా వరకు పరిష్కరించామని వెల్లడించారు. ఈ సందర్భంగా మేయర్ పదవీకాలం పూర్తి కావడంతో విజయలక్ష్మిని ఆమె ఛాంబర్‌లో సన్మానించారు.



# ఖమ్మంలో 5కోట్ల గంజాయి దగ్ధం

**ఖమ్మం, ఫిబ్రవరి 9:** మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా ఖమ్మం జిల్లాలో ఎక్సైజ్ శాఖ అధికారులు కీలక అడుగు వేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన భారీ గంజాయి నిల్వలను అధికారులు సోమవారం బహిరంగంగా కాల్చివేశారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలపేట గ్రామం సమీపంలో ఉన్న ఒక బయో వేస్టేజ్ కంపెనీ ఆవరణలో ఈ కాల్చివేత కార్యక్రమం జరిగింది. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ఈ చర్య తీసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ సుమారు 5 కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 47 కేసులకు సంబంధించి పట్టుబడిన గంజాయిని ఇక్కడకు తరలించారు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలో ఎక్సైజ్ సిబ్బంది అంతా కలిసి మంటల్లో వేసి గంజాయిని పూర్తిగా దగ్ధం చేశారు ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి సాగు చేసినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాలను ప్రయోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు కాదు.. బీఆర్ఎస్‌కు ఓటేయండి

## పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్

**సంగారెడ్డి, ఫిబ్రవరి 9:** మున్సిపల్ ఎన్నికల వేళ పటాన్‌చెరు కాంగ్రెస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్మిక సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే.. కొంతకాలంగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్న మహిపాల్ రెడ్డి, పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆయన సోదరుడు మధుసూదన్ రెడ్డి సహా కొందరు అనుచరులు ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తమ నియోజకవర్గానికి ఎలాంటి ప్రయోజనాలు రాలేదన్న కారణంతో.. మహిపాల్ రెడ్డి అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఆయన అధికారికంగా బీఆర్ఎస్‌లో చేరతారని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గతంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన మహిపాల్ రెడ్డి.. ప్రస్తుతం ఆ పార్టీపై విమర్శలు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఆ రెండు పార్టీలకు ఓటేస్తే.. తెలంగాణ మరో బంగ్లాదేశ్


## రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 9:** సీఎం రేవంత్‌రెడ్డిపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సెటైర్లు గుప్పించారు. ఓవైసీకి రేవంత్‌రెడ్డి దాసోహం అంటున్నారని విమర్శలు చేశారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అసదుద్దీన్ , అక్బరుద్దీన్‌లకు రేవంత్‌రెడ్డి సరెండర్ అయ్యారని ఎద్దేవా చేశారు. మునిసిపల్ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీని చూసి బీజేపీకి ఓటేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసినా.. ఎంఐఎంకు ఓటు వేసినా తెలంగాణ మరో బంగ్లాదేశ్ అవుతుందన్నారు. దేశాన్ని అభివృద్ధి చేస్తున్న ప్రధాని మోదీని చూసి బీజేపీకి ఓటేయాలని రాజాసింగ్ సూచించారు.

# పార్కింగ్ స్థలాన్ని కాపాడిన హైడ్రా

## 1600 గజాలు స్వాధీనం

**హైదరాబాద్,ఫిబ్రవరి9 :** హైదరాబాద్ శివార్లలోని నార్సింగి ప్రాంతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై హైడ్రా అధికారులు మరోసారి ఉక్కుపాదం మోపారు. ఒక ప్రజాప్రతినిధి అండతో కబ్జాకు గురైన అత్యంత విలువైన పార్క్ స్థలాన్ని అధికారులు విజయవంతంగా తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ప్రజల సౌకర్యార్థం కేటాయించిన స్థలాలను అక్రమంగా ఆక్రమిస్తే ఊరుకునేది లేదని ఈ చర్య ద్వారా అధికారులు స్పష్టమైన హెచ్చరికలు పంపారు. నార్సింగిలోని అరుణోదయ హౌసింగ్ సొసైటీలో సుమారు 1,600 గజాల విస్తీర్ణం కలిగిన పార్క్ స్థలాన్ని ఒక ప్రజాప్రతినిధి అక్రమంగా తన ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. ఆక్రమణదారులు ఆ స్థలం చుట్టూ భారీ ప్రహరీ గోడను నిర్మించి, దానిని తమ వ్యక్తిగత ఆస్తిగా మార్చుకునే ప్రయత్నం చేశారు. ఈ కబ్జాపై స్థానిక నివాసితులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు తక్షణమే స్పందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు, అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను జెసిబిలతో కూల్చివేసి ఆక్రమణలను తొలగించారు. అనంతరం ఆ 1,600 గజాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, దానిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ అక్రమాలకు పాల్పడిన కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కూడా అధికారులు సిద్ధమవుతున్నారు. కోట్ల రూపాయల విలువైన పార్క్ స్థలం కబ్జాకు గురవుతున్నా, స్థానిక మున్సిపల్ అధికారులు నోరు మెదపకపోవడంపై అరుణోదయ హౌసింగ్ సొసైటీ సభ్యులు , స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికారుల అండదండలు లేనిదే ఇంత పెద్ద మొత్తంలో స్థలం కబ్జాకు గురికాదని వారు ఆరోపించారు. ఏది ఏమైనప్పటికీ, హైడ్రా జోక్యంతో తమ పార్క్ స్థలం తిరిగి తమకు దక్కడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





# ఫలితాలకు ముందే ఓటమిని ఒప్పేసుకున్న సీఎం

## సీఎం రేవంత్, ఒవైసీల స్క్రిప్ట్ ఒక్కటే..

## కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ముందా?

## కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కంటే ముందే కాంగ్రెస్ తన ఓటమిని అంగీకరించిందని, అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసహనంతో బీజేపీపై అడ్డగోలు విమర్శలు చేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. సోమవారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, సీఎం వ్యాఖ్యలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి ఖాయమని ఇంటెలిజెన్స్ నివేదికలు అందడంతోనే ముఖ్యమంత్రి గందరగోళానికి గురవుతున్నారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. "గత రెండేళ్లలో మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు కాంగ్రెస్ ప్రభుత్వం నయాపైసా ఇవ్వలేదు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసినందుకు జనం బుద్ధి చెప్పాలని డిసైడ్ అయ్యారు. ఆ ఫ్రస్ట్రేషన్‌లోనే సీఎం మాట్లాడుతున్నారు" అని ఎద్దేవా చేశారు. ఎంఐఎం, కాంగ్రెస్ మధ్య అపవిత్ర పొత్తు కుదిరిందని బండి సంజయ్ ఆరోపించారు. "ఒవైసీ, రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న భాష, స్క్రిప్ట్ ఒక్కటే. బహుశా ఇది దారుస్సలాంలో లేదా గాంధీభవన్‌లో తయారవుతున్నట్లుంది. కాంగ్రెస్ అభ్యర్థులకు కాకుండా ఎంఐఎం అభ్యర్థులకు డబ్బులు పంపిస్తున్న మాట వాస్తవం కాదా? రూ.100 కోట్ల డీల్ కుదిరిందా లేదా అన్నదానిపై సీఎం సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అనే నాగుపామును ప్రజలే ఖతం చేశారని, జెర్రిపోతు లాంటి కాంగ్రెస్ పని కూడా ముగిసిందని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్, బీఆర్ఎస్ నేతల అవినీతిపై సీఎం చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. "ప్రభాకర్ రావు విదేశాలకు పారిపోతుంటే రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు? తన చేతగానితనాన్ని ఇతరులపై నెట్టడం సీఎక్కు అలవాటైపోయింది. కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము, పౌరుషం నాకు లేవు అని కేంద్రానికి ఒక లేఖ రాయండి.. అప్పుడు మేం ఏం చేస్తామో మీకే తెలుస్తుంది" అని బండి సంజయ్ సవాల్ విసిరారు. బీజేపీకి దేశం, ధర్మమే ముఖ్యమని.. మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే కరీంనగర్ సహా అన్ని పట్టణాలను కేంద్ర నిధులతో అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రాష్ట్రంలో పెరిగిన అత్యాచారాలు, హత్యలు

## మున్సిపల్ ఎన్నికల తర్వాత పన్నుపోటు

## సీఎం రేవంత్‌పై ఎంపీ డీకే అరుణ ఆరోపణలు




**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9:** రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దారుణాలు పెరిగిపోయాయని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ట్యాక్స్‌లు పెంచేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమవుతోందని ఆరోపించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిపై ఎంపీ డీకే అరుణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఖజానాలో చిల్లిగవ్వ లేదని చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమవుతోందని విమర్శించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని అరుణ తెలిపారు. అన్ని మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు ప్రచారం నిర్వహించానని చెప్పుకొచ్చారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్, భూత్‌పూర్, జడ్చర్ల మున్సిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు అవసరముందని ఎంపీ అన్నారు. మహబూబ్‌నగర్ చుట్టుపక్కల గ్రామాలు విలీన గ్రామాలుగా కలిశాయని ఎంపీ అరుణ వివరించారు. కార్పొరేషన్ అభివృద్ధి కోసం మాస్టర్ ఎ÷-లాన్ కూడా అవసరం ఉందని చెప్పుకొచ్చారు. పట్టణాల్లో స్లమ్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులు ఎన్నికల్లో గెలవగానే సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. అవినీతి రహిత, పారదర్శకమైన పాలన అందించడమే బీజేపీ లక్ష్యమని ఉద్ఘాటించారు. ప్రతి వార్డులో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై దృష్టి సారించి.. కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ మేనిఫెస్టోను ప్రజలకు అనుకూలంగా తయారుచేసి, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని డీకే అరుణ పేర్కొన్నారు.

# 11న మున్సిపల్ పరిధిలో సెలవు

**హైదరాబాద్, ఫిబ్రవరి 9:** ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎన్నికలు జరిగే కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలకు ఈ నెల 11న స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ ఎన్నికల సంఘం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కోసం వినియోగిస్తున్న విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలు, ఇతర పబ్లిక్ బిల్డింగ్స్ అన్నింటికీ 10, 11 న స్థానిక సెలవు దినంగా ప్రకటించారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ఈ నెల 11 నుండి 13 వరకు సెలవులు ప్రకటిస్తూ జారీ చేశారు.

# రేవంత్ రెడ్డి జైలుకెళ్లడం ఖాయం

- అందుకే ఓటుకునోటు ఫైలళ్లు దగ్ధం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపణ



**మెదక్,ఫిబ్రవరి 9:** ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి నిప్పులు చెరిగారు. సోమవారం మెదక్‌లో హరీశ్ రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. అందుకే ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేశారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఈ కేసులో జైలుకు వెళ్లకుండా ఉండేందుకే సాక్ష్యాలను మాయం చేశారంటూ తెలంగాణ సీఎంపై ఆయన మండిపడ్డారు. ఈ ఫోరెన్సిక్ ల్యాబొరేటరిలో జరిగిన ఈ ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగింది కాదన్నారు. ఇది సీఎం రేవంత్ డైరెక్షన్‌లో జరిగిందంటూ ఆయన బల్లగుద్ది చెప్పారు. ఈ ప్రమాదం వెనుక సీఎం రేవంత్ రెడ్డి హస్తం ఉందన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగ అంటూ రేవంత్‌ని వ్యాఖ్యానించారు. జైలుకు పోయే సమయం ఆసన్నమైందని.. అందుకే సాక్ష్యాలు మాయం చేసేందుకు హైద్రాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేశారంటూ రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. పోలీసుల సహకారంతోనే సీఎం ఈ కుట్రపన్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ డైరెక్షన్‌లోనే పోలీసులు చేసిన దహనఖాండ ఇది అని అభివర్ణించారు. రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది గుండు సున్నా అని రేవంత్ పాలనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఓటుకు నోటు సాక్ష్యాలు దగ్ధం

- ఫోరెన్సిక్ అగ్నిప్రమాదం ఓ కుట్ర
- ప్రచారంలో సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఆరోపణలు



**జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 9:** నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదం లో ఓటుకు నోటు కేసు సాక్ష్యాలను కాల్చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. అనుచిత వ్యాఖ్యలు చేసే సీఎం రేవంత్‌రెడ్డికి పోలింగ్ కేంద్ర?ంలోనే బుద్ధి చెప్పాలని అన్నారు. 420 హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. భూపాలపల్లి సింగరేణిని ఆగం చేసేందుకు చూస్తున్నారని ఆరోపణలు చేశారు. తులం బంగారం, రూ.4వేల పెన్షన్ వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయాలని అన్నారు. కేసీఆర్ పథకాలు తీసుకుంటున్న వాళ్లు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఇవ్వాళ, రేపు మద్యం, డబ్బులు పంచి ఓట్లు వేయించుకోవాలని చూస్తారని ఎద్దేవా చేశారు. మ-రోసారి మోసపోయి భస్మాసుర చేయి లాంటి కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని సూచించారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆగ్రహించారు. 12ఏళ్లలో తెలంగాణకు బీజేపీ నయాపైసా పనిచేయలేదని ÷ర్ అయ్యారు. జయశంకర్ భూపాలపల్లిలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి కేటీఆర్ వచ్చారు. ఆయన పర్యటనలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కేటీఆర్ కార్నర్ మీటింగ్ సందర్భంగా సామాజిక కార్యకర్త, దివంగత రాజలింగమూర్తి ప్లెక్సీ తొలగించారు. కేటీఆర్ కార్నర్ మీటింగ్ నేపథ్యంలో రాజలింగమూర్తి ప్లెక్సీ తొలగింపుపై బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తండ్రి ప్లెక్సీని కావాలనే బీఆర్ఎస్ నేతలు తొలగించారంటూ రాజలింగమూర్తి కుమార్తె ఆరోపించారు.

# ఏ సీఎం అయినా ఎంఐఎం దగ్గరకి రావాల్సిందే..

- మేమే లేకపోతే జూబ్లీహిల్స్ గెలిచేవారా?
- ఓవైసీ బ్రదర్స్‌ను తిట్టడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్ పని
- ఎంఐఎం భయానికి ముస్లింలకు బీజేపీ టికెట్లు
- జేపీ సెక్యూలర్ పార్టీగా మారేందుకు ప్రయత్నాలు
- ఎంఐఎం లేకపోతే బీజేపీకి మనుగడనే లేదు
- కరీంనగర్‌ను అభివృద్ధి అడ్డాగా మారుస్తాం
- కరీంనగర్‌లో అక్బరుద్దీన్ ఒవైసి సంచలన వ్యాఖ్యలు



**కరీంనగర్, ఫిబ్రవరి 9:** రాష్ట్రంలో అధికారంలో ఏ పార్టీ సీఎం అయినా, ఎంఐఎం దగ్గరికి రావాల్సిందే అని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంఐఎం అందరి పార్టీ అని పేర్కొన్నారు. రెడ్డిలు, రావులు చేసినంత డబ్బు ఖర్చు ఎంఐఎం చేయలేదేమో.. కానీ, ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా అండగా ఉంటుందని చెప్పారు. ప్రజలకు అండగా ఉండే పార్టీ ఎంఐఎం పార్టీని కార్పొరేషన్ ఎన్నికల్లో అండగా ఉండాలని, 15కు 15 సీట్లు గెలిపించిన కరీంనగర్‌సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా సోమవారం కరీంనగర్ లోని వెలమ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నగరంలో 15 డివిజన్లలో పోటీ చేస్తున్న ఎంఐఎం అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రులుగా ఎవరు వచ్చినా ఓవైసీ సోదరుల వద్దకు ఎందుకు వస్తారో ఒక్కసారి ఆలోచించాలని ప్రజలను కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ తీరును విమర్శిస్తూ, ముఖ్యంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఫలితాలను ప్రస్తావిస్తూ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్‌తో తాము కలవకపోయి ఉంటే అక్కడ గెలుపు సాధ్యమయ్యేది కాదని అభిప్రాయపడ్డారు. అధికారంలో ఎవరు ఉన్నా, వారు ఏ పార్టీ వారైనా సరే తమ వద్దకు రావాల్సిందేనని, అది కేవలం ప్రజల బలమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఏ కులం లేదా ఏ వర్గం వారు తమ సొంతం కాదని, కేవలం తమ సిద్ధాంతాన్ని నమ్మే వారే తమ బలమని పేర్కొన్నారు. ఇమామ్, మౌజన్ గౌరవ వేతనాలతో పాటు అర్చకులకు గౌరవ వేతనాల గురించి ఎంఐఎం గొంతెత్తిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంఐఎం అందరి పార్టీ అని చెప్పడానికి ఇంత కంటే ఏ ఉదాహరణ ఉండదని పేర్కొన్నారు. అసెంబ్లీలో తమ ఉనికి ఉంటేనే పనులు జరుగుతాయని, రాజకీయాలు చేయడం తమకు వెన్నతో పెట్టిన విద్య అని ఆయన తన ప్రసంగంలో ఉద్ఘాటించారు. బీజేపీకి మతరాజకీయాలు తప్ప, వేరేది చేతగాదు అని అన్నారు. నెహ్రూ నుంచి మోదీ వరకు ముస్లింలు, దళితులను మోసం చేశారన్నారు. ప్రజలను మోసం చేయడంలో మోదీ బడే భాయ్.. రేవంత్‌ఛోటే భాయి అని ఎద్దేవా చేశారు. కరీంనగర్ ఎవరి అడ్డానో కాదని, దానిని అభివృద్ధికి అడ్డాగా మారుస్తామని పేర్కొన్నారు. 420 హామీలతో కాంగ్రెస్ మోసం చేసిందని, ఏ ఒక్క హామీనైనా అమలు చేసిందా? అని ప్రశ్నించారు. మైనార్టీ సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.3500 కోట్లు ప్రకటించి, కేవలం అందులో 38శాతం మాత్రమే కేటాయించడం వారికి మైనార్టీలపై ఉన్న ప్రేమ ఎంతటిదో చాటి చెబుతున్నదని చెప్పారు. బీజేపీ నేతలు నిత్యం ఓవైసి బ్రదర్స్‌పేరును వాడుకుంటూ, రాజకీయం చేస్తున్నదన్నారు. ఎంఐఎం పార్టీ లేకపోతే, బీజేపీకి మనుగడనే లేదని పేర్కొన్నారు. ఎంఐఎం దయాదాక్షిణ్యాలతో గెలిచిన గంగుల కమలాకర్.. నేడు అదే ఎంఐఎంపై విమర్శలు చేయడం ఆయన విజ్ఞతకు నిదర్శమన్నారు. కరీంనగర్‌కార్పొరేషన్‌తో పాటు రాబోయే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై ఎంఐఎం జెండా ఎగురుతుందని జోస్యం చెప్పారు. ఎన్నికల ఫలితాల తర్వాత కరీంనగర్ కు వస్తానని, అప్పుడు విజయోత్సవ ర్యాలీలు ఘనంగా నిర్వహిద్దామని ఆకాంక్షించారు.

### ముస్లింలకు బీజేపీ టికెట్లా?


ఎంఐఎం పార్టీకి బీజేపీ భయపడుతున్నదని అక్బరుద్దీన్ విమర్శించారు. ఎంఐఎం భయానికి బీజేపీ గతంలో లేనటువంటి సంస్కృతి తెరలేపిందని, ఏకంగా ముస్లిం అభ్యర్థులకు టికెట్లు కేటాయించిందని విమర్శించారు. మతతత్వ ముద్రను తొలగించుకునే ప్రయత్నం చేస్తున్నదని చెప్పారు. కరీంనగర్‌బీజేపీ అడ్డా అయి ఉంటే, ముస్లింలకు ఎందుకు టికెట్లు కేటాయించారని ప్రశ్నించారు. కరీంనగర్ ఎవరి అడ్డా కాదని, పని చేసేటోళ్లకే ప్రజలు పట్టం కడతారని హితబోధ చేశారు. ఇక గంగుల కమలాకర్ విషయానికి వస్తే, ఆయనో కబ్జాదారుడని విమర్శించారు. సుమారు 55 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూమిని కబ్జా పెట్టారని, ఆ భూమిని తిరిగి సాధించి, ముస్లింలకు బహుమతిగా ఇస్తానని స్పష్టం చేశారు. దానిని ముస్లింల సంక్షేమానికి ఉపయోగిస్తామన్నారు. నమ్మిన సిద్ధాంతాన్ని పాటించడమే ముస్లింల జీవన విధామన్నారు. అందరి కష్టసుఖాల్లో పాలు పంచుకునే పార్టీ ఎంఐఎం అన్నారు. కరీంనగర్ లో మైనార్టీ యువత కోసం ఏ ఒక్క మైనార్టీ స్టడీ సర్కిల్ లేదని, ఎంఐఎంను గెలిపిస్తే, మైనార్టీ స్టడీ సర్కిల్‌ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం ఉమ్మడి జిల్లా పరిశీలకుడు యాసర్ అరఫాత్, కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, నగర కమిటీ నాయకులు బర్కత్ అలీ, సయ్యద్ మొయిజుద్దీన్ ఖాదిరి యూసుఫ్, ఆతిన ఆతిఫ్, ఇబ్రహీం, ఖమారుద్దీన్, అజర్ దబీర్, ఆరిఫ్ అహ్మద్, బాబుజానీ, ఫసియుద్దీన్ ఖాలీద్, సురేష్, సుధాకర్, రాజు, ఆసిమ్, అంజద్ ఖాన్, మజారొద్దీన్, అక్బర్, మొహసీన్ మొహియుద్దీన్, వాజిద్ ఖాన్, అనెమల్ల సురేష్, కొమ్ముల రామేశ్వరి, మాజీ కోఆప్షన్ సభ్యురాలు రాఫియా సుల్తానా, పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సంపాదకీయం

# తిరుమలలో సొంత డెయిరీపై ఆలోచించాలి!

తిరుమల పవిత్రతను కాపాడేందుకు తీసుకునే చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెడితే బాగుంటుంది. ఎందుకంటే దాదపు ఏడాదిన్నరగా తిరుమల లడ్డూ కల్తీ చుట్టూనే రాజకీయాలు నడుస్తున్నాయి. ఈ విషయంలో సిట్ దర్యాప్తు సాగుతోంది. ప్రత్యేక విచారణలు చేపట్టారు. మరో ఏకసభ్య కమిటీ వేస్తున్నట్లు సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇక తిరుమల పవిత్రత దెబ్బతినకుండా, రాజకీయాలకు తావు లేకుండా కఠిన చర్యలకు అసవరమైన నిర్ణయాలు తీసుకోవడంలో దృష్టి పెడితే మంచిది. తిరుమలలో తీసుకునే నిర్ణయాలను ఇప్పుడు ఎవ్వరూ ప్రశ్నించరు. భక్తులకు వసతి పెంచడం, సౌకర్యాలు పెంచడం, శీఘ్రగతిన దర్శనాలు కల్పించడంలో ప్రధాన నిర్ణయాలు జరగాలి. తిరుమలలో సామాన్యులకు సత్వర దర్శనం అన్నది కలగా మారింది. విఐపిల తాకిడి పెరుగుతోంది. స్వామిని దర్శించుకున్న వారే ఇంకా దర్శించుకుంటున్నారు. అలాగే తిరుమలలో ప్లాస్టిక్ నిషేధం జరగాల్సి ఉంది. లడ్డూలను తాటాకు బుట్టల్లో సరఫరా చేస్తామని గతంలో ప్రకటించినా అమల్లోకి రాలేదు. మంచినీటి సమస్యలు రాకుండా చూడాలి. తిరుమలలో సొంత డెయిరీ ఏర్పాటుపై ఆలోచన చేయడం లేదు. ఇకపోతే తెలంగాణ నేతల సిఫార్సులపై విక్ష ఇంకా కొనసాగుతోంది. ఈ విక్ష తొలగిపోవాలి. తెలంగాణ నేతలను చిన్నచూపు చూడడం ద్వారా ప్రభుత్వం ఈ ప్రాంతా ప్రజలను అవమానపరుస్తోంది. తిరుమల కొండల్లో పచ్చదనం పెంచాల్సి ఉంది. అడువుల్లో సామాజిక వనాలు పెరగాలి. ఇవన్నీ వదిలేసి ఇంకా కల్తీ నెయ్యి వ్యవహారంతో టిడిపి కూటమి ఒకవైపు, వైకాపా నేతలు మరో వైపు అన్నట్లుగా విమర్శలు, ప్రతివిమర్శలు చేయడం సరికాదు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో సాగుతున్న రాజకీయ ఘటనలు దిగజారుతున్న రాజకీయ విలువలకు పరాకాష్టగా మారాయి. తిరుపతి లడ్డూ కల్తీపై సుప్రీంకోర్టు జోక్యంతో సిబిఐ ఏర్పాటు చేసిన సిట్ నివేదిక బహిరంగ పరచకుండానే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ స్వంత వ్యాఖ్యానాలతో రాజకీయంగా లబ్ది పొందే చర్యలకు దిగారు. లడ్డూ ప్రసాదంలో కొవ్వు అంటూ అధికార కూటమి చేసిన ప్రచారానికి ప్రాయశ్చితంగా యజ్ఞాలు, యాగాలు, పూజలకు వైసిపి నాయకులు తెరతీసారు. దీనికి పోటీగా లడ్డు కల్తీ చేసిన వైసిపి నేతలంటూ అనేక జిల్లాల్లో పేరు, ఊరు లేని బ్యానర్లు వెలిశాయి. పరస్పర విమర్శలతో మొదలై, హద్దులు దాటిన వ్యక్తిగత విమర్శలకు చేరి, దాడులకు, గృహ దహనాల వరకు ఆ వివాదం విస్తరించింది. తిరుపతి లడ్డు కోట్ల మంది ప్రజల విశ్వాసంతో ముడిపడిన సున్నితమైన అంశం. తమ విశ్వాసానికి తగ్గట్టుగా ప్రసాదం పవిత్రంగా వుండాలని కోరుకుంటారు. అలాంటి లడ్డూలో ఆవు కొవ్వు, ఇతర జంతువుల కొవ్వుల లాంటివి కలిశాయని ముఖ్యమంత్రి చెప్పడంతో తక్షణం నిజానిజాలు తేల్చి దోషులకు శిక్ష వేసివుంటే ఇంత రచ్చ జరిగి ఉండేది కాదు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందూ మతానికి అపచారం జరిగిందంటూ కనకదుర్గమ్మ గుడి మెట్లు కడిగారు. ఇలా కాకుండా నిజాలు నిగ్గుతేల్చి దోషులను కోర్టు ముందు నిలబెట్టి ఉంటే బాగుండేది. అన్నింటికి మించి తిరుమల శ్రీవారు కోట్లకు పడగలెత్తారు. ఆయనకు వందలాది గోవులు కూడా ఉన్నాయి. నిజానికి చిత్తశుద్ధి ఉంటే గోశాలలను విస్తరించి, సొంత డెయిరీ ఏర్పాటు చేసివుంటే పేచీ వచ్చేది కాదు. గోశాలలను పెంచి, డెయిరీ ఏర్పాటు చేస్తే నిరుద్యోగ సమస్యా కొంత తీరుతుంది. నెయ్యి కల్తీ సమస్య ఉత్పన్నం కాదు. కల్తీ తీవ్రమైన ఆరోపణ కాబట్టి సంబంధిత అధికార సంస్థల ద్వారా నేరాన్ని నిరూపించి నిందితులకు శిక్షపడేలా చేయడం ప్రభుత్వ బాధ్యత. అందుకోసం నియమించిన సిట్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలి. నివేదికలో ఏముందో ప్రకటించకుండానే మరో కమిటీ వేయడంలో అర్థం లేదు. నిజానికి కల్తీ నెయ్యి వ్యవహారం తిరుమల ప్రతిష్టను దెబ్బ తీసేందుకు జరిగిన కుట్ర అనడంలో సందేహం లేదు. హిందూ మతంపై దాడి అని అనడంలోనూ సందేహం లేదు. గతంలో జరిగిన రామతీర్థం, అంతర్వేది, దుర్గ గుడి విగ్రహాల విధ్వంసం, రథాలు కాలిపోవడం లాంటి విషయాలను ప్రస్తావించి ఇదంతా హిందూ మతాన్ని దెబ్బతీసి నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న కుట్ర అని పవన్ కళ్యాణ్ ఇప్పటికే ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల చర్యలు అంతిమంగా తమ రాజకీయ పబ్బం గడుపుకునేలా తయారయ్యాయి. ఈ సమస్యలనే ఇక ఇంతటితో ముగించాలి. తిరుమల శ్రీవారికి అవసరమైన ఆవునెయ్యిని పొందేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. తిరుమలలో డెయిరీ ఏర్పాటు చేస్తే మరీమంచిది. శాశ్వతంగా సమస్యకు పరిష్కారం దక్కగలదు. వేలకోట్లు వృధా చేసే బదులు శ్రీవారికి అవసరమైన నెయ్యి, పాలు, వెన్న, మీగడలను పొందేందుకు ఇదే సరైన సమయం. డబ్బులకు కొదవ లేదు. గోవులకు కొదవ లేదు. చంద్రబాబు హెరిటేజ్ నడిపిన అనుభవంతో తిరులమ శ్రీవారి కోసం ఓ మంచి డెయిరీ ఏర్పాటు చేస్తే మంచిది. సుగంధ ద్రవ్యాలను కూడా కొండపై పండించే అవకాశలను పరిశీలించాలి. పూదోటలను విస్తరించాలి. ఆ దిశగా కూటమి నేతలు ఆలోచనలు చేయాలి. సమర్థులైన అధికారులు, బోర్డు ఛైర్మన్, సభ్యులు, ఉన్నప్పుడే ఇది సాధ్యం అవుతుంది. రాజకీయ తాబేదార్లకు బోర్డును అప్పగించినంతకాలం ఇది ఇది సాధ్యం కాదు. ఇకపోతే తిరుమల కల్తీ వ్యవహారాన్ని కోర్టుల తుది తీర్పుకు వదిలేయాలి. అప్పటి వరకు రాజకీయ విమర్శలకు దిగకపోవడం మంచిది.



# స్పీకర్ తీరుపై విపక్షాల ఆగ్రహం

- అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే యోచన
- ఖర్గేతో వివిధ పక్షాల నేతల భేటీలో చర్చ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు సజావుగా సాగకపోవడంతో ఇటు అధికార పక్ష సభ్యులు, అటు విపక్ష సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గందరగోళ పరిస్థితుల మధ్య ఉభయసభల కార్యకలాపాలకు తరచు అంతరాయం కలుగుతోంది. సభలో తమను మాట్లాడేందుకు అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచనలో విపక్షాలు ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు. విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆప్రకారం బడ్జెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బడ్జెట్ తొలి విడత సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13తో ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2 వరకూ జరుగుతాయి. కాగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) తదితరల పార్టీల ఎంపీలు ఈ సమావేశంలో పాల్గొన్నట్టు సమాచారం. మరోవైపు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై దాడికి సిద్ధమయ్యామంటూ తమపై అసత్య ఆరోపణలు చేయడాన్ని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఖండించారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా తాము నిరసన తెలిపామని, హింసకు దిగాలని తాము అనుకోలేదని, విపక్షాలను ఎదుర్కొనే ధైర్యం ప్రధానికి లేకపోవడం వల్లే భయపడి సభకు రాలేదని మహిళా ఎంపీలు ఆ లేఖలో పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్ నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. ఎంపిక చేసి మరీ 8 మంది విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేశారని, మాజీ ప్రధానులపై బీజేపీ ఎంపీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ జోతిమణి, పలువురు మహిళా ఎంపీలు ఈ లేఖపై సంతకాలు చేశారు.




# సర్ ప్రక్రియను అడ్డుకోవద్దు

## బెంగాల్ సర్ ప్రక్రియపై సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 9:** బెంగాల్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సోమవారంనాడు కీలక వ్యాఖ్యలు చేసింది. 'సర్' పక్రియకు అడ్డంకులు కల్పించే ఎలాంటి ప్రయత్నాలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. ఏదైనా బెటర్‌మెంట్ చేయాల్సిన అవసరం వచ్చినట్లయితే తామే కల్పించుకుంటామని తెలిపింది. పశ్చిమబెంగాల్‌లో 'సర్' పక్రియను ఫిబ్రవరి 14 నుంచి 21వ తేదీ వరకూ మరో వారం పొడిగిస్తున్నట్టు పేర్కొంది. ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే మేమే జారీ చేస్తాం. అంతేకానీ సర్ పక్రియను అడ్డుకోవడాన్ని మాత్రం అనుమతించం. అన్ని రాష్ట్రాలు దీన్ని అర్థం చేసుకోవాలి' అని సీజేఐ సూర్యకాంత్ స్పష్టం చేశారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ పక్రియను సవాలు చేస్తూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు తాజా వ్యాఖ్యలు చేసింది. సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఎస్ఐఆర్ పక్రియలో 8,500 మంది ఆఫీసర్లు పాల్గొంటున్నట్టు విచారణ సందర్భంగా సీజేఐ పేర్కొన్నారు. ఈ పని ముందే చేసి ఉంటే తాము ఆమోదించి ఉండేవాళ్లమన్నారు. మైక్రో-అబ్జర్వర్ల స్థానంలో ఉపయోగించుకుంటున్న 8,000 మంది గ్రూప్-బి అధికారుల పేర్లు పంపడంలో ఎందుకు జాప్యం జరిగిందని బెంగాల్ ప్రభుత్వాన్ని సీజేఐ ప్రశ్నించారు. ఫిబ్రవరి 4న తాము ఆదేశాలిస్తే ఫిబ్రవరి 7వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకూ ఎందుకు పంపించలేదని మమతాబెనర్జీని ప్రస్తావిస్తూ ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి తన వాదన వినిపిస్తూ, ఎన్నికల కమిషన్ ఎప్పుడూ బి-గ్రూప్ ఆఫీసర్లను అడగలేదని, అలాంటి రిక్వెస్ట్ కూడా ఎప్పుడూ చేయలేదని చెప్పారు. ఓటర్ల స్థానికతను నిరూపించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇవ్వడం లేదని బెంగాల్ ప్రభుత్వ న్యాయస్థానం దృష్టికి తెచ్చింది. దీంతో డాక్యుమెంట్ల వెరిఫికేషన్, ఎన్నికల తుది జాబితా గడువును మరో వారం రోజుల పాటు ఫిబ్రవరి 21 వరకూ పొడిగిస్తున్నట్టు ధర్మాసనం పేర్కొంది.




# డిజిటల్ అరెస్టు మోసాలపై సుప్రీం వ్యాఖ్యలు

- సైబర్ నేరగాళ్లు రూ.54వేల కోట్లు కొల్లగొట్టారని ఆందోళన
- ఆర్‌బిఐ, బ్యాంకులు, టెలి కమ్యూనికేషన్‌లు ఉమ్మడి కార్యాచరణ చేయాలి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 :** దేశంలో డిజిటల్ అరెస్టు మోసాలు పెరిగిపోవడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుల్లో సైబర్ నేరగాళ్లు రూ. 54వేల కోట్లు కొల్లగొట్టారని, ఇది భారీ దోపిడీ అంటూ ఆందోళన వ్యక్తంచేసింది. దోచుకున్న సొమ్ము చిన్నరాష్ట్రాల బ్జడెట్ కంటే ఎక్కువగా ఉందని పేర్కొంది. ఈ మోసాలపై అత్యున్నత న్యాయస్థానంలో తాజాగా విచారణ జరిగింది. వాటికి చెక్ పెట్టేందుకు ఆర్‌బీఐ, బ్యాంకులు, టెలికమ్యూనికేషన్ విభాగం సంప్రదింపులతో నిర్ణీత ప్రమాణాల కార్యాచరణను రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది. అందుకు నాలుగువారాల గడువు ఇచ్చింది. ఈ నేరాలకు కొందరు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం, కుట్ర కూడా కారణం కావొచ్చని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఆర్‌బీఐ, బ్యాంకుల నుంచి సకాలంలో చర్యలు ఉండాలని ఆదేశించింది. డిజిటల్ అరెస్టు కేసుల్లో పరిహారం విషయమై ఆర్‌బీఐ, టెలికమ్యూనికేషన్ విభాగం, ఇతర విభాగాలు సంయుక్తంగా సమావేశంకావాలని సూచించింది. తదుపరి విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది. ఇదిలా ఉంటే.. డిజిటల్ ఆర్థిక మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, బ్యాంకింగ్ వినియోగదార్లకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ఉపశమనాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒక మోసపూరిత లావాదేవీకి రూ. 25,000 వరకు పరిహారాన్ని అందివ్వనుంది. మోసగాళ్లకు వన్ టైం పాస్‌వర్డ్ ఇవ్వడం ద్వారా, డబ్బులు పోగొట్టుకున్న వారికీ ఈ పరిహారం అందుతుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. అయితే ఆ లావాదేవీలు దురుద్దేశంతో కూడుకున్నవి కాకుండా ఉండాలన్నారు.




# ఐటీ కంపెనీల్లో ఏఐ నిపుణుల నియామకాలు

## వీసా ఖర్చులకు వెనకాడని ప్రముఖ సంస్థలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 :** భవిష్యత్తు ఏఐదే అని అమెరికా టెక్ కంపెనీలు బలంగా నమ్ముతున్నాయి. భారీగా పెట్టుబడులు కుమ్మరిస్తున్నాయి. అంతేకాకుండా, ఈ రంగానికి చెందిన విదేశీ నిపుణులను హెచ్-1బీ వీసాల ద్వారా పెద్ద ఎత్తున నియమించుకుంటున్నాయి. వీసా ఫీజులు పెరిగినప్పటికీ అమెరికా టెక్ సంస్థలు అక్కడి కార్మిక శాఖకు వీసా పిటిషన్లు దరఖాస్తు చేసుకుంటున్నాయి. నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ (ఎన్ఎఫ్ఏపీ) సంస్థ జరిపిన అధ్యయనంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. అమెజాన్, మెటా, గూగుల్, మైక్రోసాఫ్ట్ యాపిల్ 2025 ఆర్థిక సంవత్సరంలో విదేశీయుల నియామకాల కోసం సమర్పించిన లేబర్ కండీషన్ అప్లికేషన్లలో(ఎల్‌సీఏ) మెజారిటీ ఏఐ సంబంధిత ఉద్యోగాలవే. ఫారినర్ల తరఫున హెచ్-1బీ పిటిషన్‌ల దాఖలకు మునుపు కంపెనీలు ఎల్‌సీఏను దాఖలు చేస్తాయన్న విషయం తెలిసిందే. అమెజాన్ సమర్పించిన 60 శాతం ఎల్‌సీఏ దరఖాస్తులు ఏఐ సంబంధిత ఉద్యోగాల కోసమేనని ఎన్ఎఫ్ఏపీ అధ్యయనంలో తేలింది. మెటా ఎల్‌సీఏ దరఖాస్తుల్లో 58 శాతం, గూగుల్ ఎల్‌సీఏ దరఖాస్తుల్లో 71 శాతం ఏఐ సంబంధిత ఉద్యోగాలవేనని తెలిసింది. ఏఐ రంగంలో నిలదొక్కుకునేందుకూ అమెరికా సంస్థలు విదేశీ నిపుణులపై ఆధారపడుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఫోర్బ్స్ కథనం ప్రకారం, అమెరికన్ టెక్ కంపెనీలు ఇప్పటికే ఏఐపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇదే క్రమంలో ప్రతిభావంతులైన విదేశీ ఉద్యోగుల వీసా ఖర్చుల విషయంలో కూడా వెనకాడట్లేదు. ఖర్చులు తగ్గించుకునేందుకే కంపెనీలు హెచ్-1బీ వీసాదారులకు ఉద్యోగాలు ఇస్తాయన్న విమర్శ ఇకపై చెల్లుబాటు కాదని కూడా విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. 1990-2010 మధ్య కాలంలో అమెరికా ఉత్పాదకతలో 30 శాతం -50 శాతం స్టెమ్ రంగాలకు చెందిన విదేశీ నిపుణులు కారణమని కొందరు ఆర్థికవేత్తలు అంచనావేశారు. ఏఐ రంగంలో అమెరికా అగ్రగామిగా ఉండాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే పలుమార్లు చెప్పారు. అయితే, వలసలపై ఆయన అమలు చేస్తున్న కఠిన ఆంక్షల కారణంగా అమెరికా వెనకబడే అవకాశం ఉందన్న కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి.







## ఆత్మగౌరవ పోరాటం

మెట్‌పల్లి పట్టణంలో దశాబ్దాలుగా కార్యకర్తగా, సేవకుడిగా గుర్తింపు పొందిన మర్రి హర్షిత-నందకిషోర్ ఈసారి స్వతంత్ర అభ్యర్థిగా 7వ వార్డు బరిలో నిలిచారు. బీజేపీలో పట్టణ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ, పలుమార్లు టికెట్ ఆశించినా పార్టీలో డబ్బు, వర్గపోరాటాల వల్ల అన్యాయానికి గురైన ఆయన, ఇప్పుడు ప్రజల మధ్య నుంచే పోరాడాలని నిర్ణయించుకున్నారు. "నాయకుడు కాదు, నిరంతర సేవకుడు" అనే నినాదంతో, కరప్షన్ లేని పాలన, వార్డు అభివృద్ధి కోసం ఆయన ప్రజల ముందుకు వచ్చారు. ఇది కేవలం ఎన్నికల పోటీ కాదు, సిద్ధాంతాలు, కార్యకర్తల గౌరవం కోసం జరుగుతున్న న్యాయపోరాటం.



**"రాజకీయాలు పదవుల కోసం కాదు.. ప్రజల కోసం అన్న నమ్మకంతో, పార్టీ టికెట్ల అన్యాయాన్ని మౌనంగా భరించిన ఒక సాధారణ కార్యకర్త చివరకు ప్రజల తీర్పునే నమ్ముకున్నాడు.! పార్టీ గేట్లు మూసినా.. ఏడవ వార్డు గుండెలు తెరిచిన వేళ.! "నాయకుడు కాదు... నిరంతర సేవకుడే కావాలి" అన్న సిద్ధాంతాన్ని చేతల్లో చూపించడానికి మర్రి హర్షిత-నందకిషోర్ 'స్వతంత్ర'గా బరిలోకి దిగారు. ఇది కేవలం ఒక అభ్యర్థి కథ కాదు... కార్యకర్త ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీక.."**

- నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య)

# మాట తప్పడు మడమ తిప్పడు!

- అన్యాయాన్ని ఎదురించి స్వతంత్ర బాటలో అడుగులు
- మెట్‌పల్లి 7వ వార్డులో 'నందన్న' సమర శంఖారావం
- పార్టీ సిద్ధాంతాలకంటే డబ్బే ప్రామాణికమయ్యిందని ఆవేదన
- 25 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో పదే పదే జరిగిన అవమానం
- ఆపదలో తోడైన 'నందన్న'కు ప్రజలే బలమైన వేళ
- ఏడవ వార్డు అభివృద్ధే లక్ష్యంగా 'స్వతంత్ర పోరాటం'

## పార్టీలో పలుమార్లు ఎదురైన అన్యాయం

మర్రి హర్షిత-నందకిషోర్ 2013 మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఆదేశంతో నామినేషన్ వేసినా, పార్టీకి సంబంధం లేని వ్యక్తిని తీసుకొచ్చి టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేశారు. 2019లో కొన్ని కారణాల వల్ల పోటీ చేయలేక పోయారు. ఇప్పుడు 2026 మెట్ పల్లి మున్సిపాలిటీ ఎన్నికల సమయంలోనూ పార్టీ ఆదేశంతో నామినేషన్ వేసిన తర్వాత, రాత్రికి రాత్రి పార్టీలో చేర్చుకున్న మరొకరికి టికెట్ కేటాయించడంతో మళ్లీ అదే అన్యాయం పునరావృతమైంది. దీంతో బాధపడిన ఆయన, పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు.ఒకప్పుడు సిద్ధాంతాలు ఉన్నవారికే పార్టీలో చోటు ఉండేది. ఇప్పుడు కాసులు కురిపించినవారికే టికెట్లు దక్కుతున్నాయి. అప్పుడు కార్యకర్తల పార్టీగా ఉండేది, ఇప్పుడు 'సర్వేల పార్టీ'గా మారింది. నాయకుడు కార్యకర్త వెంట నడిచేవాడు, ఇప్పుడు కార్యకర్త నాయకుడి గేటు ముందు నిలబడాల్సి వస్తోంది. మెట్ పల్లి, కోరుట్లలో కార్యకర్తలే పార్టీని ఢిల్లీ దాకా తీసుకెళ్లారు. వారిని పక్కకు జరిపితే పార్టీ పునాదులే పక్కకు వెళ్తాయని ఆయన హెచ్చరిస్తున్నారు.

## తెలంగాణ ఉద్యమం నుంచి రాజకీయ ప్రవేశం వరకు..

25 ఏళ్ల క్రితం ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన హర్షిత-నందకిషోర్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. టీఆర్ఎస్ పార్టీ తన సేవలను వాడుకుని తర్వాత విస్మరించింది. ఆ తర్వాత బీజేపీలోకి వచ్చినా 2013లో "సురభి భూంరావు వర్గం"గా



ముద్ర వేసి టికెట్ నిరాకరించారు. 2019లోనూ అదే పరిస్థితి. ఇప్పుడు కూడా డబ్బు లేకపోవడం, "సురభి నవీన్" వర్గమని చెప్పి తలుపులు మూసేశారు. దీంతో అవమానకరంగా భావించి పార్టీ నుంచి బయటకు వచ్చి స్వతంత్రంగా పోటీ చేస్తున్నారు. ప్రజలు, హితులు, సన్నిహితులు "ప్రజాసేవ చేయాలంటే పైసలే కావాలా? మేం గెలిపిస్తాం" అంటూ బలవంతం చేసి బరిలోకి దింపారు. "మాట తప్పేది లేదు, మడమ తిప్పేది లేదు - దేఖ్ లేంగే" అంటూ సమరానికి సిద్ధమయ్యారు.

## 7వ వార్డు అభివృద్ధికి హామీలు

పట్టణ శివారు ప్రాంతంలో అభివృద్ధి అంతంతమాత్రంగా ఉంది. దొంగల బెడద తగ్గించేందుకు సొంతంగా సీసీ కెమెరాలు పెట్టించి రక్షణలో భాగస్వామ్యం కావాలని ఆయన భావిస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి - డ్రైనేజీ కాలువలు నిర్మింపజేస్తానని హామీ ఇచ్చారు. అంతర్గత రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తానని చెప్పారు.అర్హులైన వారికి ఇండ్లు లేకపోవడం పెద్ద సమస్య. తనతోపాటు అర్హులైన వారందరికీ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఇండ్లు మంజూరు చేయిస్తాను. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇతర అవసరాల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మీ బిడ్డకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి, ఒక్కసారి అవకాశం ఇవ్వండి - 7వ వార్డును మెట్‌పల్లిలోనే అత్యుత్తమ అభివృద్ధి చెందిన వార్డుగా తీర్చిదిద్దుతానని మర్రి హర్షిత-నందకిషోర్ ప్రజలను కోరుతున్నారు.కరప్షన్ లేని పాలన అందించడమే లక్ష్యంగా, పార్టీ గుర్తులు కాదు... ప్రజల ఆశీర్వాదాలే తన అసలైన బలమని నమ్ముతున్నాడు.ఈ ఎన్నికలు కేవలం గెలుపు-ఓటమి కాదు - కార్యకర్తల గౌరవం, సిద్ధాంతాల పోరాటంగా చెప్పుకోవచ్చు.! అందుకే ఆయన తన సతీమణి ప్రోద్బలంతో 'ఛలో..మాట తప్పేది లేదు... మడమ తిప్పేది లేదు..' అంటూ సమరానికి సిద్ధమయ్యాడు నందన్న.!



## ప్రజల మధ్య నుంచి ఉద్భవించిన నాయకుడు 'నందన్న'

మెట్‌పల్లి ప్రజలకు "నందన్న"గా పరిచితుడైన మర్రి హర్షిత-నందకిషోర్ ఏ ఆపద వచ్చినా అర్ధరాత్రి అయినా ఆలోచన లేకుండా ముందుకు వస్తారు. కరోనా పీక్ సమయంలో భయపడుతున్న ప్రజలకు అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశారు. రక్తదానం, గుప్తదానం, అన్నదానం - ఏదైనా పబ్లిసిటీ లేకుండా సేవ చేయడం ఆయన డీఎన్ఏలోనే ఉంది. జేబులో రూపాయి లేకపోయినా "నడిచే ఎటిఎం"లా ఊరంతా తిరిగి ప్రజల సమస్యలు తీరుస్తారు.అదే విధంగా.. ఆధ్యాత్మికంగా కూడా "మకుటం లేని మహారాజు"గా పేరుపొందారు. వినాయక నవరాత్రోత్సవాలు, బతుకమ్మ సంబరాలు, దుర్గాదేవి నవరాత్రోత్సవాలు - ఏ సంబరమైనా 24/7 అందుబాటులో ఉండి, టీలు, టిఫిన్లు, భోజనాలు, కోలాటాలు, ముగ్గులు, డిజేలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలం సృష్టిస్తారు. ప్రజలు ఆయనను గట్టెక్కించే, ఆపద్బాంధవుడిగా అభిమానిస్తుంటారు.

కోరుట్ల పట్టణంలో సేవా భావానికి చిరునామాగా నిలిచిన వ్యక్తి అంబటి శ్రీనివాస్. వృత్తి నిబద్ధత, సంఘ సేవ, సామాజిక స్పృహ, ఆధ్యాత్మిక సాధన అన్నీ కలగలిసిన జీవితం ఆయనది. మూడు దశాబ్దాలుగా ప్రింటింగ్ రంగంలో నిలకడగా సాగుతూ, మరోవైపు అయ్యప్ప దీక్షతో ఆధ్యాత్మిక బాటలో నడుస్తూ, ప్రజల మధ్యే 'గురుస్వామి'గా కొనసాగుతున్న 'శీనన్న' ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతూ, గురుతర బాధ్యతను భుజాన వేసుకున్నారు.


- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)






# 'అంబటి శీనన్న'పై అయ్యప్ప.. 'గురు'తర బాధ్యత!

## సేవ, సాధన, సాధికారత - ఒక వ్యక్తి ప్రయాణమే ప్రజాసేవకు పునాది



### భవిష్యత్ సంకల్పం.. స్వార్థం లేని సేవ

కౌన్సిలర్‌గా గెలుపొందితే, వార్డులో అవసరమైన అన్ని మున్సిపల్ సంబంధిత పనులను ఎటువంటి స్వలాభపేక్ష లేకుండా చేయాలన్నది ఆయన స్పష్టమైన వాగ్దానం. వార్డు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారం కోసం కృషి చేయాలన్నదే ఆయన సంకల్పం. సౌమ్య స్వభావం, కార్యదీక్ష, సేవాభావం కలగలిసిన 'శీనన్న'పై ఇప్పుడు గురుతర బాధ్యత పడింది. ఆధ్యాత్మిక సాధన నుంచి రాజకీయ సేవ వరకు ఆయన ప్రయాణం, ప్రజాసేవకు అంకితమయ్యే నాయకత్వానికి దారి చూపుతోంది. ప్రజల నమ్మకమే తన బలం అని నమ్మే ఈ వ్యక్తి రాజకీయాల్లోకి రావడం, స్థానిక పాలనకు కొత్త ఆశగా మారనుంది.



### మధ్యతరగతి గడపలో మొదలైన జీవన బాట

సాధారణ కుటుంబం నుంచి సేవా వ్యక్తిత్వం వరకు ఆయన జీవ నశైలి ఇదీ.. కోరుట్లలోని మధ్యతరగతి కుటుంబంలో అంబటి నా రాయణ-లక్ష్మి దంపతులకు జన్మించిన అంబటి శ్రీనివాస్, సాధారణ జీవన నేపథ్యం నుంచే జీవిత పాఠాలు నేర్చుకున్నారు. పదవ తరగతి వరకు విద్యాభ్యాసం పూర్తి చేసినప్పటికీ, జీవితాన్ని చదివిన తీరు ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టింది. కష్టాన్ని పనిగా మార్చుకోవడం, పనిని సేవగా భావించడం ఆయన జీవన తత్వంగా మారింది.

### పని అంటే బాధ్యత.. బాధ్యత అంటే నమ్మకం

30 సంవత్సరాలుగా 'అయ్యప్ప ప్రింటింగ్ ప్రెస్' ద్వారా పట్టణ ప్రజలకు సేవలందిస్తూ, వ్యాపారంలోనూ విలువలకు పెద్దపీట వేశారు శ్రీనివాస్. నాణ్యత, సమయపాలన, నమ్మకం..ఇవే ఆయన్ను ఈ రంగంలో స్థిరపరిచాయి. వ్యాపారం ద్వారా లాభం కంటే సంబంధాలను సంపాదించుకున్న వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది.

### యువతకు మార్గదర్శకత్వం

సామాజిక సేవ పట్ల ఉన్న తపనతో 'గ్రేట్ ఇండియా యూత్' సహాయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. యువతను సేవా కార్యక్రమాల వైపు నడిపిస్తూ, సమాజానికి తిరిగి ఇవ్వాలనే భావనను బలపరిచారు. సమస్యలను చూసి స్పందించే మనసే ఆయనను ప్రజల మధ్య నిలబెట్టింది.

### సంఘ సేవలో ప్రజాస్వామ్య పద్ధతులు

పద్మశాలి కులోన్నతి సంఘంలో రెండు సార్లు కోశాధికారిగా, ఉపాధ్యక్షునిగా, అలాగే జగిత్యాల డివిజన్ కార్యదర్శిగా ఎన్నిక ద్వారా బాధ్యతలు స్వీకరించారు. సంఘ సేవలో పారదర్శకత, నిబద్ధత, సమిష్టి అభివృద్ధి అనే విలువలను ఆచరణలో చూపించారు. ఎన్నికల ద్వారా ప్రజల విశ్వాసం పొందడం ఆయన నాయకత్వ లక్షణాలకు నిదర్శనం.

### అయ్యప్ప దీక్షతో మొదలైన సాధన

31 సంవత్సరాల క్రితం అయ్యప్ప దీక్షతో ఆధ్యాత్మిక రంగంలోకి అడుగుపెట్టిన శ్రీనివాస్, కాలక్రమేణా గురుస్వామిగా ఎదిగారు. అయ్యప్ప దేవాలయంలో ప్రధాన కార్యదర్శిగా, కోశాధికారిగా, రెండుసార్లు అధ్యక్షునిగా సేవలందించారు. తాను అనుకుంటే ఎంత కంకణబద్ధుడవుతాడన్నదానికి నిదర్శనంగా, ప్రస్తుతం అయ్యప్ప ఆలయం అధ్యక్షుడిగా ఉంటూనే విరాళాలు సేకరించి సుమారు రూ.3 కోట్ల విలువైన శివాలయ నిర్మాణానికి పూనుకోవడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఇది ఆయన కార్యదీక్షకు నిలువెత్తు ఉదాహరణ.

### ప్రత్యక్ష రాజకీయాల్లో తొలి అడుగు.!

ఇప్పటివరకు చేసిన సేవా కార్యక్రమాల ద్వారా పొందిన అనుభవం, ప్రజల్లో ఉన్న గుర్తింపుతో ప్రజాసేవను మరింత విస్తృతంగా చేయాలనే తలంపుతో, ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి తరపున 27వ వార్డు కౌన్సిలర్‌గా తొలిసారి బరిలో నిలిచారు. ఇది పదవికోసం చేసిన ప్రయాణం కాదు, బాధ్యత కోసం తీసుకున్న నిర్ణయం.

### శీనన్న స్థానంలోకి..మళ్లీ ఇంకో శీనన్న?

ఇదివరకు ఇదే 27వ వార్డులో కౌన్సిలర్‌గా గెలుపొంది కొనసాగిన 'గుండోజి శ్రీనివాస్' బిఆర్ఎస్ పార్టీ'కి



చెందిన వారే కాగా..ఆయన 'హాట్రిక్ విజయం' సాధించే అవకాశాలు ఉన్నప్పటికీ 'రాజకీయాల నుంచి స్వచ్ఛందం'గా తప్పుకున్నారు. అతని స్థానంలో..మరో 'శీనన్న'నే వచ్చారని..ఆ 'అయ్యప్ప'నే పోటీ చేయమని ఆదేశించినట్టు వచ్చినట్టుందని కొందరు 'ఆ-శీనన్న' అభిమానులు సోషల్ మీడియాలో చర్చించుకోవడం విశేషం.







## రాహుల్ సెంచరీతో ముంబై ఇంటికి..
# రంజీ సెమీఫైనల్లో కర్నాటక!

భారత జట్టుకే కాదు దేశవాళీలోనూ తాను ఆపద్బాదవుడిని అని చాటుకున్నాడు కేఎల్ రాహుల్. రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో ఈ క్లాస్ బ్యాటర్ సెంచరీతో గర్జించాడు. ముంబై బౌలర్లను చితక్కొడుతూ శతకంతో కర్నాటకను సెమీ ఫైనల్ చేర్చాడు. 325 పరుగుల ఛేదనలో రెచ్చిపోయిన రాహుల్ మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌తో 42 సార్లు ఛాంపియన్ ముంబైని ఇంటికి పంపాడు. దాంతో.. 11 ఏళ్ల తర్వాత టైటిల్ వేటకు అడుగు దూరంలో నిలిచింది కర్నాటక. రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో కేఎల్ రాహుల్ తన తడాఖా చూపించాడు. ముంబై నిర్దేశించిన భారీ ఛేదనలో మూడంకెల స్కోర్‌తో కర్నాటకను సెమీస్ తీసుకెళ్లాడు. ఎంసీఏ బీకేసీ మైదానంలో నాలుగో రోజు మయాంక్ అగర్వాల్(3) విఫలమవ్వగా.. రాహుల్‌నే నమ్ముకుంది కర్నాటక. శార్దూల్ ఠాకూర్, తుషార్ పాండే ఓవర్లో చెత్త బంతులను శిక్షించి లక్ష్యాన్ని కరిగించాడు. రాహుల్(130)కు కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్(39) అండగా నిలవగా చక్కని కవర్ డ్రైవ్స్‌తో అలరించిన అతడు అర్ధ శతకం భాగస్వామ్యం నెలకొల్పాడు. అనంతరం స్మరన్ రవిచంద్రన్(83 నాటౌట్)తో కలిసి విలువైనరన్స్ జోడించిన ఈ సొగసరి బ్యాటర్ 147 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అతడికిది 24వ సెంచరీ. రాహుల్ ఖతర్నాక్ శతకంతో నాలుగు వికెట్ల తేడాతో ముంబైని చిత్తు చేసింది కర్నాటక.



### ఆ ఇద్దరు నిలబడడంతో..

తొలి ఇన్నింగ్స్‌లో కర్నాటకు 53 పరుగుల ఆధిక్యం సమర్పించుకున్న ముంబై.. రెండో ఇన్నింగ్స్‌లో ఛాంపియన్‌లా ఆడింది. వికెట్ కీపర్ ఆకాశ్ ఆనంద్(70) హాఫ్ సెంచరీతో మెరవగా.. ఆఖర్లో తనుష్ కొతియాన్(48 నాటౌట్), తుషార్ దేశ్‌పాండే(47)లు కర్నాటక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. వీరిద్దరి పట్టుదలతో రెండో ఇన్నింగ్స్‌లో ముంబై 375 పరుగులు చేసి ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

## ఇండియాతో ఆడాలంటే.. 3 కీలక షరతులు పెట్టిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు



ఇస్లామాబాద్: టీ20 వరల్డ్‌కప్‌లో ఇండియాతో ఫిబ్రవరి 15వ తేదీన జరగనున్న మ్యాచ్‌ను ఆడబోమని పాకిస్థాన్(ఖుఎఅర్ఖుఅ జతీఱఎఎవ దీశ్ఖుతీస) చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆ మ్యాచ్‌ను నిర్వహించేందుకు ఐసీసీ తమ వంతు ప్రయత్నం చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఇద్దరు సభ్యుల బృందం పాకిస్థాన్ వెళ్లింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మెన్ మోషిన్ నఖ్వీతో చర్చలు నిర్వహించారు. భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు మూడు కీలక షరతులు పాకిస్థాన్ పెట్టినట్లు తెలుస్తోంది. ఓ మీడియా కథనం ప్రకారం ఆ షరతులు ఇలా ఉన్నాయి. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు వార్షిక నిధులను ఐసీసీ పెంచాలని కోరింది. ఇక ఇండియా, భారత్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లను పునరుద్దరించాలని ఐసీసీని అభ్యర్థించింది. అయితే ఇండియా, పాక్ మధ్య మ్యాచ్ జరుగుతున్న సమయంలో.. ఆటగాళ్లు ఆన్‌ఫీల్డ్ ఎథిక్స్ పాటించాలని, ప్లేయర్లు అందరూ షేక్ హ్యాండ్ ఇచ్చుకోవాలని పాక్ క్రికెట్ బోర్డు ఐసీసీని కోరినట్లు తెలుస్తోంది. టీ20 వరల్డ్‌కప్ నుంచి బంగ్లాదేశ్‌ను బహిష్కరించిన నేపథ్యంలో ఆ దేశానికి మద్దతు ఇస్తూ ఇండియాతో ఆడేందుకు పాకిస్థాన్ నిరాకరించిన విషయం తెలిసిందే.ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కలిసిన తర్వాత తుది నిర్ణయం వెల్లడించనున్నట్లు నఖ్వీ తెలిపారు.

## ఇటలీపై స్కాట్లాండ్ ఘన విజయం.. జార్జ్ మున్సే సూపర్ ఇన్నింగ్స్



టీ20 ప్రపంచ కప్ 2026 (ఎ20 ఔశీతీశ్రీ జబజూ-2026) లో భాగంగా సోమవారం ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 207 పరుగులు చేసింది. 208 పరుగుల లక్ష్యఛేదనలో ఇటలీ.. 16.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. బెన్ మానెంటి (52), హెన్రీ మానెంటి (37), స్మట్స్ (22) మాత్రమే రాణించారు. స్కాట్లాండ్ బౌలర్లలో మైకేల్ లీస్క్ 4, మార్క్ వాట్ 2, బ్రాడ్ క్యూరీ, బ్రాడ్ వీల్, డేవిడ్సన్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జ్ మున్సే (84) అద్భుతమైన హాఫ్ సెంచరీ చేశాడు. మరో ఓపెనర్ మైకేల్ జోన్స్ (37) పరుగులు రాబట్టాడు. ఈ జోడీ తొలి వికెట్‌కు 126 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. తర్వాత వచ్చిన బ్రాండన్ మెక్‌మిలన్ (41 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. రిచీ బెరింగ్టన్ (15) పరుగులు చేశాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో మైకేల్ లీస్క్ (22) వరుసగా 4, 2, 4, 6, 6 బాదడంతో స్కోరు 200 దాటింది. ఇటలీ బౌలర్లలో అలీ హసన్, గ్రాంట్ స్టీవర్ట్, థామస్ డ్రాకా, స్మట్స్ తలో వికెట్ తీశారు.

## కొలంబోలో జింబాబ్వే జయభేరి..
### పోరాడి ఓడిన ఒమన్

**సికందర్ రజా ఆల్‌రౌండ్ షో.. పసికూనపై ఘన విజయం**
**రాణించిన సీన్ విలియమ్స్, మధెవెరె**
**ఒమన్ బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బతీసిన ముజరబానీ**
**22 పరుగుల తేడాతో గెలుపొందిన జింబాబ్వే**

**కొలంబో:** టీ20 ప్రపంచ కప్ సమరంలో అనుభవజ్ఞులైన జింబాబ్వే జట్టు తమ సత్తా చాటింది. కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియం వేదికగా జరిగిన ఆసక్తికర పోరులో ఒమన్ జట్టుపై 22 పరుగుల తేడాతో విజయం సాధించి టోర్నీలో బోణీ కొట్టింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 176 పరుగుల పోరాట పటిమ కలిగిన స్కోరును సాధించగా, లక్ష్యఛేదనలో ఒమన్ జట్టు గట్టిగా పోరాడినప్పటికీ 9 వికెట్లు కోల్పోయి 154 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ సికందర్ రజా అద్భుతమైన అర్ధ సెంచరీతో పాటు బౌలింగ్‌లోనూ రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

మొదట బ్యాటింగ్ చేపట్టిన జింబాబ్వేకు ఓపెనర్లు వెస్లీ మధెవెరె, క్రెయిగ్ ఎర్విన్ శుభారంభం అందించారు. పవర్ ప్లేలో ఆచితూచి ఆడిన వీరిద్దరూ వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డారు. అయితే ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సికందర్ రజా, సీన్ విలియమ్స్ ఒమన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. వీరిద్దరూ మైదానం నలువైపులా బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. రజా 38 బంతుల్లో 62 పరుగులు చేయగా, విలియమ్స్ 40 పరుగులు చేసి అవుటయ్యాడు. చివరి ఓవర్లలో ర్యాన్ బర్ల్ మెరుపులతో జింబాబ్వే స్కోరు 175 దాటింది. ఒమన్ బౌలర్లలో బిలాల్ ఖాన్ రెండు వికెట్లు తీసి పర్వాలేదనిపించినా, మిగతా బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు.

177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్ జట్టుకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబానీ తన ఎత్తు, బౌన్స్‌తో ఒమన్ ఓపెనర్లను బెంబేలెత్తించాడు. ఓపెనర్ కశ్యప్ ప్రజాపతి (35) కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకుంటూ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. అతనికి కెప్టెన్ అక్విబ్ ఇలియాస్ (28) నుంచి సహకారం లభించినా, జింబాబ్వే బౌలర్లు కట్టుదిట్టమైన బంతులు వేయడంతో ఒమన్ రన్ రేట్ బాగా పడిపోయింది. మధ్య ఓవర్లలో సికందర్ రజా తన స్పిన్ మాయాజాలంతో కీలకమైన రెండు వికెట్లు తీసి మ్యాచ్‌ను జింబాబ్వే వైపు తిప్పాడు.

చివరి ఓవర్లలో నసీమ్ ఖుషి (24) భారీ షాట్లతో మ్యాచ్‌ను గెలిపించే ప్రయత్నం చేసినప్పటికీ, జింబాబ్వే డెత్ బౌలర్ల ముందు అతని ఆట సాగలేదు. నిర్ణీత సమయానికి వికెట్లు చేజార్చుకున్న ఒమన్, లక్ష్యానికి 22 పరుగుల దూరంలో నిలిచిపోయింది. జింబాబ్వే బౌలర్లలో ముజరబానీ 3 వికెట్లు, నగారావా, రజా తలో రెండు వికెట్లు తీసి ఒమన్‌ను కట్టడి చేశారు. ఈ విజయంతో జింబాబ్వే రెండు కీలక పాయింట్లు సాధించి సూపర్-8 రేసులో ముందంజ వేసింది. ఒమన్ జట్టు పోరాట పటిమ కనబరిచినప్పటికీ, కీలక సమయాల్లో ఒత్తిడికి చిత్తవడం వారి కొంపముంచింది.

# సఫారీల శుభారంభం..
## కెనడాపై ఘన విజయం

- అహ్మదాబాద్ వేదికగా దక్షణాఫ్రికా ఆల్రౌండ్ షో
- కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన మార్క్రమ్.. మిల్లర్ మెరుపులు
- కెనడా నడ్డి విరిచిన పేసర్ లుంగి ఎంగిడి
- నవనీత్ ధాలివాల్ ఒంటరి పోరాటం వృథా
- 57 పరుగుల తేడాతో ప్రొటీస్ జయకేతనం



**అహ్మదాబాద్:** టీ20 ప్రపంచ కప్ 2026 పోరులో దక్షిణాఫ్రికా జట్టు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో పసికూన కెనడాపై 57 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సఫారీలు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగుల భారీ స్కోరు సాధించగా, లక్ష్యఛేదనలో కెనడా 8 వికెట్లు కోల్పోయి 156 పరుగులకే పరిమితమైంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమిష్టిగా రాణించిన దక్షిణాఫ్రికా ఈ వరల్డ్ కప్‌లో తమ ఆధిపత్యాన్ని చాటుకుంది.

మొదట బ్యాటింగ్ చేపట్టిన దక్షిణాఫ్రికాకు ఓపెనర్లు శుభారంభం అందించగా, ఆ తర్వాత కెప్టెన్ ఎయిడెన్ మార్క్రమ్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. కెనడా బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న మార్క్రమ్ 32 బంతుల్లోనే 59 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు పునాది వేశాడు. ఇన్నింగ్స్ చివరలో డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. మిల్లర్ 23 బంతుల్లో అజేయంగా 39 పరుగులు చేయగా, స్టబ్స్ 19 బంతుల్లో 34 పరుగులు చేసి స్కోరు బోర్డును 200 దాటించారు. వీరిద్దరూ 5వ వికెట్‌కు అజేయంగా 75 పరుగులు జోడించడంతో ప్రొటీస్ జట్టు 213 పరుగుల భారీ లక్ష్యాన్ని కెనడా ముందుంచగలిగింది. కెనడా బౌలర్లలో అన్ష్ పటేల్ 3 వికెట్లు తీసి పర్వాలేదనిపించినా, మిగతా బౌలర్లు సఫారీ బ్యాటర్ల ధాటికి ధారాళంగా పరుగులిచ్చారు.

214 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కెనడాకు ఆరంభం నుంచే కష్టాలు ఎదురయ్యాయి. దక్షిణాఫ్రికా పేసర్ లుంగి ఎంగిడి తన పేస్, స్వింగ్‌తో కెనడా టాప్ ఆర్డర్‌ను బెంబేలెత్తించాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే వికెట్ తీసి కెనడాను దెబ్బకొట్టిన ఎంగిడి, వరుస విరామాల్లో వికెట్లు తీస్తూ ప్రత్యర్థిని కోలుకోనివ్వలేదు. తన కోటా 4 ఓవర్లలో 31 పరుగులిచ్చి కీలకమైన 4 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. మరోవైపు మార్కో జాన్సెన్ కూడా 2 వికెట్లు తీసి కెనడా బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశాడు.

అయితే, వికెట్లు పడుతున్నా కెనడా ఓపెనర్ నవనీత్ ధాలివాల్ మాత్రం ఒంటరి పోరాటం చేశాడు. దక్షిణాఫ్రికా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ 49 బంతుల్లో 64 పరుగులు చేసి అర్ధ సెంచరీ సాధించాడు. హర్ష్ ఠాకర్ (33) అతనికి కొంత సహకరించినప్పటికీ, భారీ లక్ష్యాన్ని ఛేదించడానికి ఆ పోరాటం సరిపోలేదు. చివరకు కెనడా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ విజయంతో దక్షిణాఫ్రికా తమ నెట్ రన్ రేట్‌ను మెరుగుపరుచుకోగా, అనుభవం లేని కెనడా జట్టు బౌలింగ్, బ్యాటింగ్ వైఫల్యాలతో టోర్నీలో తొలి ఓటమిని చవిచూసింది.

# ఏషియన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత జయకేతనం

### మను బాకర్‌కు రజతం..
### ఇషా సింగ్‌కు కాంస్య పతకం

**స్పోర్ట్స్ డెస్క్, ఫిబ్రవరి 9:** ప్రతిష్టాత్మక ఏషియన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. ఆదివారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో భారత్‌కు పతకాల పంట పండింది. స్టార్ షూటర్ మను బాకర్ రజత పతకంతో మెరవగా, తెలంగాణ తేజం ఇషా సింగ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుని త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. ఆసియాలోని అగ్రశ్రేణి షూటర్లతో పోటీపడిన భారత ద్వయం, అద్భుతమైన ఏకాగ్రతతో లక్ష్యాన్ని ఛేదించి పోడియంపై రెండు స్థానాలను ఆక్రమించారు.

ఫైనల్ పోరు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరిన మను బాకర్, తుది పోరులోనూ అదే జోరును కొనసాగించింది. స్వర్ణ పతకం కోసం చైనా షూటర్‌తో నువ్వా-నేనా అన్నట్లు పోటీపడింది. చివరి సిరీస్ వరకు ఆధిక్యం కోసం పోరాడిన మను, స్వల్ప పాయింట్ల తేడాతో వెనుకబడి రెండో స్థానంతో సరిపెట్టుకుంది. అయినప్పటికీ, ఆమె కనబరిచిన స్థిరమైన ప్రదర్శనపై ప్రశంసల జల్లు కురుస్తోంది. కీలక సమయాల్లో ఒత్తిడిని జయిస్తూ ఆమె సాధించిన రజతం భారత్‌కు గర్వకారణంగా నిలిచింది.

మరోవైపు హైదరాబాద్‌కు చెందిన యువ షూటర్ ఇషా సింగ్ తన సత్తా చాటింది. ప్రపంచ స్థాయి షూటర్లతో పోటీపడుతూ ఏమాత్రం బెదురు లేకుండా గురి చూసి కాల్చింది. ఎలిమినేషన్ రౌండ్లలో అద్భుతమైన షాట్లతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టిన ఇషా, టాప్-3లో చోటు దక్కించుకుంది. ఫైనల్లో మను బాకర్‌తో పాటు పోటీపడిన ఆమె, నిర్ణీత పాయింట్లు సాధించి కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. ఒకే ఈవెంట్‌లో ఇద్దరు భారత షూటర్లు పోడియంపై నిలవడం విశేషం. ఈ విజయంతో రాబోయే ప్రపంచ కప్, ఇతర అంతర్జాతీయ టోర్నీలకు తమ ఆత్మవిశ్వాసం రెట్టింపయిందని షూటర్లు పేర్కొన్నారు. వీరి విజయాలపై భారత షూటింగ్ సమాఖ్య హర్షం వ్యక్తం చేసింది.



# రాకున్నా మేనేజ్ చేస్తున్నా

## వారిణాసి హీరోయిన్ ప్రియాంక

రాజమౌళి-మహేష్ బాబుల క్రేజీ కాంబోలో వస్తున్న 'వారణాసి' సినిమా ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తోంది. సుమారు రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ గ్లోబ్ ట్రాటింగ్ యాక్షన్ అడ్వెంచర్‌లో ప్రియాంక చోప్రా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. మహేష్ బాబు 'రుద్ర'గా

కనిపిస్తుండగా, విలన్ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. అయితే ఈ మూవీ గురించి ఎలాంటి చిన్న వార్త వచ్చిన కూడా నిమిషంలో వైరల్ అవుతుంది. ఇందులో భాగంగా తాజాగా అంతర్జాతీయ మీడియాతో మాట్లాడిన ప్రియాంక, ఈ సినిమాలో నటించడం తన కెరీర్‌లోనే ఒక విభిన్నమైన అనుభవమని పేర్కొన్నారు. ముఖ్యంగా.. తెలుగు భాష రాకపోవడం తనను ఇబ్బంది పెట్టినప్పటికీ, రాజమౌళి సహకారం తో దాన్ని అధిగమిస్తున్నట్లు తెలిపారు. ప్రియాంక చోప్రా మాట్లాడుతూ.. 'వారణాసి సినిమాలో నటించడం నాకు ఒక పెద్ద ఛాలెంజ్‌గా మారింది. నిజం చెప్పాలి అంటే నాకు తెలుగు అస్సలు రాదు, అర్థం కూడా కాదు. కేవలం డైలాగులను అక్షరాలా గుర్తుపెట్టుకుని పలుకుతున్నాను. సెట్‌లో ఒక్కసారిగా డైలాగ్స్ మారిస్తే నాకు చాలా కష్టమవుతుంది. అలాంటి సమయంలో రాజమౌళి సర్ నాకు అండగా నిలుస్తారు. ప్రతి మాట అర్థం, భావం వివరించి అది ఏ టోన్‌లో చెప్పాలో ఆయన వివరంగా చెబుతారు. కొన్నిసార్లు డైలాగ్ అర్థం చేసుకోవడానికి పది నిమిషాలు సమయం తీసుకుని, నా స్టైల్‌లో చెప్పే ప్రయత్నం చేస్తాను. ఇది నాకు ఒక అదనపు పెర్ఫార్మెన్స్ లేయర్ లాంటిది' అని వివరించారు. తన తోటి నటుడు పృథ్వీరాజ్‌కు కూడా తెలుగు రాదని, కానీ తనకంటే ఆయనే కొంచెం బెటర్ అని ప్రియాంక సరదాగా వ్యాఖ్యానించారు.

# తగిన వరుడి కోసం చూస్తున్నా

## అమ్మ సురేఖావాణికి మళ్లీ పెళ్లి చేయాలనుకుంటున్నా

## ఇంటర్వ్యూలో సుప్రీత



టాలీవుడ్ సీనియర్ నటి సురేఖా వాణి తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లోనూ కీలక పాత్రలు పోషిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా 'బొమ్మరిల్లు' సినిమాతో ఆమెకు మంచి పేరు వచ్చింది. కొంతకాలంగా సినిమాలకు గ్యాప్ ఇచ్చిన సురేఖా వాణి ఇప్పుడు తెరపై తక్కువగా కనిపిస్తున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇదిలా ఉండగా ఆమె కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెడుతూ 'అమరావతికి ఆహ్వానం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 13న విడుదల కానుండగా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సుప్రీత తన తల్లి గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో సుప్రీత మాట్లాడుతూ తన తల్లి సురేఖా వాణికి మళ్లీ పెళ్లి చేయాలనే ఆలోచన తనకు ఉందని వెల్లడించింది. 'రీసెంట్‌గా ఈ విషయం అమ్మతో చెప్పాను. కానీ ఆమె మాత్రం నాన్న జ్ఞాపకాలతోనే జీవించాలనుకుంటోంది. ఆ ప్లేస్‌లోకి వేరే ఎవరినీ రానివ్వకూడదని భావిస్తోంది. అదే సమాధానం నాకు చెప్పిందని సుప్రీత తెలిపింది. అయితే తాను పెళ్లి చేసుకునేలోపు అయినా అమ్మకు మంచి జీవిత భాగస్వామి దొరికితే బాగుంటుందని కోరుకుంటున్నానని చెప్పింది. సురేఖా వాణి కెరీర్ గురించి కూడా సుప్రీత మాట్లాడింది. ఒకప్పుడు తన తల్లి ఎంతో బిజీ ఆర్టిస్ట్ అని, ఇప్పుడు మాత్రం అవకాశాలు తగ్గిపోయాయని పేర్కొంది. మేకప్ వేసుకుని ఏడాదిన్నర దాటిపోయింది. సినిమాల్లో నటించాలని అమ్మకు ఇంకా ఆసక్తి ఉంది. కానీ అవకాశాలు రావడం లేదు అని ఫీల్ అవుతోంది. కనీసం ఒక మంచి పాత్ర వచ్చినా చేయాలని ఉందని చెబుతోంది అని తెలిపింది. ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇక సుప్రీత హీరోయిన్‌గా పరిచయం అవుతున్న 'అమరావతికి ఆహ్వానం' చిత్రం హారర్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కింది. ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, శివకంఠనేని కీలక పాత్రల్లో నటించారు. జీవీకే దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేఎస్ శంకర్రావు, ఆర్ వెంకటేశ్వరరావు నిర్మించారు. గ్రామీణ నేపథ్యంలో మిస్టరీ, క్షుద్రపూజలు, మూఢనమ్మకాల అంశాలతో కథ నడుస్తున్నట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది.

# మృణాల్ చుట్టూ పెళ్లి రూమర్లు



బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ ఈ మధ్య కాలం లో డేటింగ్, పెళ్లి రూమర్లతో హాట్ టాపిక్‌గా నిలుస్తున్నారు. ఈ రూమర్స్ మధ్య బాలీవుడ్ హీరో చేసిన పని హాట్ టాపిక్‌గా మారింది. యంగ్ హీరో సిద్ధాంత్ చతుర్వేది మృణాల్‌పై పూల వర్షం కురిపించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. మృణాల్ ఠాకూర్, సిద్ధాంత్ చతుర్వేది కలిసి నటించిన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా ఈ జంట ఒక ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవెంట్ వేదిక బయట ఫొటోగ్రాఫర్లతో మాట్లాడుతున్న మృణాల్‌పై సిద్ధాంత్ గొడుగులో నింపుకుని తెచ్చిన పూలతో అకస్మాత్తుగా పూల వర్షం కురిపించాడు. దీనికి మృణాల్ ఇచ్చిన స్మైల్ రియాక్షన్ నెటిజన్లను ఆకట్టుకుంది. అక్కడితో ఆగని సిద్ధాంత్, అదే ప్రమోషనల్ ఈవెంట్ స్టేజ్‌పైనా మరోసారి మృణాల్‌పై పూలు చల్లాడు. ఈ రెండు ఘటనలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో వీరిద్దరి మధ్య ఏదైనా ప్రత్యేక బంధం ఉందా అనే చర్చలు మొదలయ్యాయి. అభిమానులు, నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్లు చేస్తూ ఊహాగానాలు పెంచుతున్నారు. మరోవైపు మృణాల్ ఠాకూర్ తమిళ స్టార్ హీరో ధనుష్‌తో డేటింగ్‌లో ఉందనే వార్తలు కూడా కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 14న వీరిద్దరి పెళ్లి జరుగుతుందనే రూమర్లు వచ్చినప్పటికీ మృణాల్ టీమ్ వాటిని ఖండించింది. అవి కేవలం పుకార్లేనని స్పష్టం చేసింది.



# 11న నెట్‌ఫ్లిక్స్‌లోఅనగనగా ఒకరాజు

నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు'.. సంక్రాంతి కానుకగా.. జనవరి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయంతో పాటు కలెక్షన్స్ కూడా సాధించింది. ఈ సినిమాకు మారి దర్శకత్వం వహించగా.. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మించిన ఈ మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించింది. ఈ మూవీ ప్రముఖ ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు సిద్ధంగా ఉంది. ఫిబ్రవరి 11నుండి ఈ సినిమా అందుబాటులోకి రానున్నట్లు నెట్‌ఫ్లిక్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసింది. 'రాజుగారి పెళ్లంటే ఏడు తరాలు అటు ఇటు గుర్తుండిపోవాలి' అని స్పెషల్ పోస్టర్ షేర్ చేశారు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# మిర్యాలగూడ ఎన్నికల హోరాహోరీ "పుర పీఠం"పై ఉత్కంఠ



**నేటి సాక్షి, మిర్యాలగూడ:** రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మిర్యాలగూడ పట్టణంలో రాజకీయ వేడి రోజురోజుకూ పెరుగుతోంది. ఆర్థికంగా బలమైన ఈ పురపీఠాన్ని దక్కించుకోవడానికి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో పాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ నెల 11న జరగనున్న ఎన్నికల్లో ప్రజలు ఎవరికి పట్టం కడతారో అన్న ఆసక్తి రాజకీయ వర్గాలతో పాటు ప్రజల్లోనూ నెలకొంది. పట్టణంలో మొత్తం 48 వార్డుల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను గెలిపించేందుకు భారీ స్థాయిలో ప్రచారం చేపట్టాయి. కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రస్తావిస్తూ ప్రచారం నిర్వహించగా, బీఆర్ఎస్ నాయకులు గత పాలనలో చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లారు. బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా తమకు అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరుతున్నారు. ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు కీలకంగా మారే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఓటరు నాడి ఎవరికీ స్పష్టంగా అర్థం కావడం లేదని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొన్ని వార్డుల్లో ఓటర్లు మౌనం పాటించడం ఫలితాలపై ప్రభావం చూపవచ్చని అంచనా. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక మిర్యాలగూడ పురపీఠం ఎవరికి దక్కుతుందో అన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

# అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- జువ్వాడి నర్సింగ్‌రావు



**నేటి సాక్షి, కోరుట్ల అర్బన్ (విఆర్ ధర్మేంద్ర):** కోరుట్ల పట్టణంలోని 2, 15, 8, 9, 23, 7వ వార్డుల్లో మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్‌రావు పాల్గొని మాట్లాడారు. కోరుట్ల పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావు చేసిన అభివృద్ధి వల్లే పట్టణం ముందుకు సాగిందని, గత పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు, నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడం, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఇంకా రేషన్ కార్డులు, ఇండ్లు అందని అర్హులైన లబ్ధిదారులకు మున్సిపల్ ఎన్నికల అనంతరం అందజేస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలోని అన్ని వార్డులు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ ఇంచార్జ్ శ్రీనివాస్, కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా మునిసిపాలిటీలు ఉండాలి

- రాయికల్ లో గులాబీ జెండా ఎగరవేస్తాం..
- జగిత్యాలలో ఊహించని మెజార్టీ సీట్లు సాధిస్తాం
- ఎమ్మెల్సీ ఎల్.రమణ




**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎల్ రమణ జగిత్యాల కార్యాలయంలో ( నివాసంలో) మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ మునిసిపాలిటీలు ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా రాజ్యాంగం ప్రకారం ప్రధానంగా బల్దియలో అవకతవకలకు అవకాశం లేకుండా ఉండాలని అన్నారు.మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ ఎస్ హాయంలో జరిగిన అభివృద్ధిని ప్రజల ముందుంచామని,అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టామన్నారు. ప్రజాక్షేత్రంలో బీఆర్ ఎస్ ప్రచారానికి అపూర్వ స్పందన లభించిందని, జగిత్యాల నియోజకవర్గంలోని రాయకల్, జగిత్యాల పట్టణంలో గులాబీ జెండా ఎగరవేస్తున్నామని, జగిత్యాల మునిసిపాలిటిలోను ఊహించని తీర్పును ప్రజలు ఇవ్వబోతున్నారని అన్నారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ.ప్రధాన పార్టీలు ఇచ్చిన హామీలు విస్మరించాయని, గులాభి సైనికులకే ప్రజలు పట్టం కట్టబోతున్నారని అన్నారు.నిఖార్సయిన గులాభి సైనికులకు,నిబద్ధత కలిగిన నిజాయితిపరులకే సీట్లు ఇచ్చామని అన్నారు. జగిత్యాలలో గులాబి జెండా హవా నడుస్తోంది ఓటర్లను ఎన్ని రకాలుగా ప్రలోభ పెట్టినా వారు స్పష్టంగా ఉన్నారు. జగిత్యాల అభివృద్ధి పై వైరల్ అవుతున్న వీడియోలు బీ.ఆర్.ఎస్ హయాంలో చేసినవే రెండేళ్లలో అక్కడక్కడ సీసీ రోడ్లు తప్ప చేసిందేమీ లేదు.ప్రశ్నించే గొంతుకలకు ఓటేయబోతున్నారు ప్రజలు ఈ ఎన్నికల్లో ఎలక్షన్ మిరాకిల్ జరగబోతోంది. మెడికల్ కళాశాల,నర్సింగ్ కళాశాల,మాత శిశు కేంద్రం,చింతకుంట చెరువు అభివృద్ధి ఘనత బి.ఆర్ ఎస్ దే 4520 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేసీఆర్ గారు ఇచ్చినవే.. అప్పుడే స్వయంగా కేటీఆర్ గారు లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో దీ=నా నాయకులుదావ సురేష్,ఎల్ కార్తికేయ,పట్టణ అధ్యక్షులు అయిల్నేని వెంకటేశ్వర్ రావు,ప్రధాన కార్యదర్శి అల్లాల ఆనంద్ రావు,మాజీ జడ్పీటీసీ కొలుముల రమణ,శీలం ప్రవీణ్, ఆసీఫ్,అనంతుల గంగారెడ్డి, పడిగేల గంగారెడ్డి,ఎండబెట్ల ప్రసాద్, వొళ్యాల గంగాధర్,వనమాల నిరంజన్, కుడిక్యాల సర్వేశ్వర్, అజ్జర్ ఖాన్, వసీం, గంగిపెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ముందడుగు..

- జగిత్యాలలో బీజేపీ నేత కొండా లక్ష్మణ్ వీస్తృత ప్రచారం



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు):** కేంద్రంలో కొలువున్న బీజేపీ ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోది నాయకత్వంలో దేశం ముందుండుగు వేస్తోందని జగిత్యాల బీజేపీ నేత కొండా లక్ష్మణ్ అన్నారు.జగిత్యాల మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, యువకులు మహిళలు తోడు రాగా బీజేపీ నేత కొండా లక్ష్మణ్ సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 26,44,48 వార్డులలో బీజేపీ అభ్యర్థుల తరపున కొండా లక్ష్మణ్ ఇంటింటి ప్రచారం చేపట్టాగా ప్రజల్లో అపూర్వ స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా కొంద లక్ష్మణ్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంఅభివృద్ధి పథంలో దుసుకుపోతుందన్నారు. మన ధర్మాన్ని మనం రక్షించుకోవాలని అందుకు బీజేపీ ని బలపర్చాలని కోరారు. పట్టణంలోని 50వార్డు లకు గాను 29 వార్డులు మహిళ లకు బీజేపీ టికెట్లు కేటాయించిందని లక్ష్మణ్ తెలిపారు.జగిత్యాల పట్టణంలోని అన్ని వార్డులలో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి అంత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇస్తున్న నిధులు ద్వారానే అని గుర్తు చేశారు.

బీజేపీ అభ్యర్థులు కౌన్సిల్ లో ఉండడం వలన అవినీతి ప్రక్షాళన జరుగుతుందని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ అభ్యర్థులు పనిచేస్తారని కొండా లక్ష్మణ్ తెలిపారు.

# 13వ వార్డులో బీజేపీ గెలుపే లక్ష్యం

మీ సుధ వేణు కీర్తన మహేష్




**నేటి సాక్షి, కోరుట్ల అర్బన్ (విఆర్ ధర్మేంద్ర):** కోరుట్ల పట్టణం 13వ వార్డులో బీజేపీ అభ్యర్థి మీ సుధ వేణు కీర్తన మహేష్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా మహమ్మారి సమయంలో ప్రజలు భయంతో బయటకు రాని పరిస్థితుల్లో తాము ప్రాణాలకు తెగించి వందలాది శవదహనాలు నిర్వహించి సేవలందించామని తెలిపారు. లాక్‌డౌన్ సమయంలో ఉపాధి కోల్పోయిన కూలీలకు వారానికి సరిపడే నిత్యావసర సరుకులు అందించామని, డాక్టర్లు, పోలీస్ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు, భిక్షాటన చేస్తున్న వారికి స్వయంగా వంట చేసి భోజన సౌకర్యం కల్పించామని చెప్పారు. ఆ క్లిష్ట సమయంలో ప్రజలకు ధైర్యం ఇచ్చేందుకు బీజేపీ కార్యకర్తలు ముందుండి సేవలు చేశారని పేర్కొన్నారు. తాను చేసిన సేవలను గుర్తించి కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# చైర్మన్ పీఠంపై హస్తం గురి

అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం జువ్వాడ నరసింహారావు



**నేటి సాక్షి, కోరుట్ల అర్బన్ (విఆర్ ధర్మేంద్ర):** కోరుట్ల పట్టణం 26వ వార్డులో మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడ నరసింహారావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా ప్రచారం చేస్తూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి శ్రీ అన్నం లావణ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కోరుట్ల పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు చేసిన అభివృద్ధి వల్లే పట్టణం అన్ని రంగాల్లో ఎదిగిందని అన్నారు. తాను గెలిచిన తర్వాత వార్డు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కోరుట్ల పట్టణం సమగ్ర అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పీఆర్‌టీయూటీఎస్ ఆవిర్భావ దినోత్సవం


**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని పీఆర్‌టీయూటీఎస్ కార్యాలయంలో 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు సామల యాదగిరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు బోయినిపల్లి ఆనంద్‌రావు, ప్రధాన కార్యదర్శి యాల్ల అమర్నాథ్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమంతో



పాటు విద్యావ్యవస్థ బలోపేతానికి పీఆర్‌టీయూ విశేషంగా కృషి చేసిందన్నారు. ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం పలు జీవోలు సాధించడం, ఉమ్మడి సర్వీసు రూల్స్, 010 జీతాలు, అప్రెంటిషిప్ రద్దు, మహిళా ఉపాధ్యాయులకు ప్రత్యేక క్యాజువల్ లీవ్స్, మెటర్నిటీ లీవ్స్, చైల్డ్ కేర్ లీవ్స్ అమలు చేయడంలో పీఆర్‌టీయూ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. సంఘానికి విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు చింతపండు నర్సింగం, మానేరు శంకరయ్య, జనార్దన్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఉపాధ్యాయ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యుడు అబ్దుల్ జమీల్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల శాఖ బాధ్యులు పాల్గొన్నారు.

# మంత్రి ఆధ్వర్యంలో

రూ.5 లక్షల చెక్కు పంపిణీ



**నేటి సాక్షి - నారాయణపేట ఇమామ్ సాబ్:** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం ఉట్కూర్ మండలం ఏడవల్లి గ్రామానికి చెందిన సబిరా బేగంకు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో రూ.5 లక్షల ఎల్‌వోసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలికి అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

- **11న ఎన్నికలు - ముందస్తు చర్యలపై అధికారులకు దిశానిర్దేశం**



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు):** జిల్లాలో ఫిబ్రవరి 11న నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజగౌడ్, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఓటరు స్లిప్‌ల పంపిణీ, బ్యాలెట్ బాక్స్‌ల ధ్రువీకరణ, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి సమయానికి పంపిణీపై కలెక్టర్ ప్రత్యేకంగా సూచనలు ఇచ్చారు. పోలింగ్ స్టేషన్లలో పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగ ఓటర్ల కోసం వీల్‌చైర్లు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా బందోబస్తు, సీసీ కెమెరాల ఏర్పాటు, పోలింగ్ అధికారుల డైరీ నిర్వహణపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి డిఏ, టిఏ చెల్లింపులు ఆలస్యం లేకుండా చేయాలని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో ఒక మోడల్ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఉపాధి హామీలో మహాత్మాగాంధీ పేరు మార్పు తగదు..



- **రామ్ జీ బిల్లును రద్దు చేయాలి.. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు**

**నేటి సాక్షి జూపాడుబంగ్లా :** కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలోనే అత్యంత నీరు పేదలకు ఉపయోగపడే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయాలని కుట్ర పడిందని,అందులో భాగంగానే మహాత్మా గాంధీ పేరు మార్చి కొత్తగా ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ జి రామ్ జి బిల్లును రద్దు చేయాలని లేనిపక్షంలో ఆందోళన తప్పదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు హెచ్చరించారు. సోమవారం పీజీఆర్ఎస్ లో తహసీల్దార్ చంద్ర శేఖర్ నాయక్ కు సీపీఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాల కమ్యూనిస్ట్ ల పోరాటల ఫలితంగా ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందని, తిండైనా పెట్టండి,పనైనా చూపండి జైలుకైనా పంపండి అనే నినాదంతో పెద్ద ఎత్తున పోరాటం చేస్తే సాధించిన అతి పెద్ద పథకం ఉపాధిహామీ పథకం అన్నారు.అలాంటి పథకాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని కొత్తగా ప్రవేశపెట్టిన జీ రాంజీ బిల్లు వల్ల ఉపాధి హామీ కూలీలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఉపాధి హామీ కూలీలకు 250 వందల రోజులు పని దినాలు కల్పించి వేతనం 600 రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈనెల 11 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో జి రాంజీ బిల్లు రద్దు కొరకు తీర్మానం చేసి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపాలన్నారు. దేశంలో మోడీ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం పేదల పట్ల కక్ష్య పూరితంగా వ్యవహరిస్తూ ఉపాధి హామీని నిర్వీర్యం చేయాలని చూస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి మాగబుల్ బాషా, తిరుపతయ్య, రాజు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఆవిర్భవించిన సంఘం పిఆర్‌టీయూ





- **నేడు ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**నేటి సాక్షి ఆత్మకూరు :** పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన పి ఆర్ టీ యూ, ఫిబ్రవరి 9, 1971 న ఆవిర్భవించింది. నాటి నుంచి నేటి వరకు అనేక +ూ లు సాధించి ఉపాధ్యాయ సంక్షేమం కోసం పాటుపడుతూ, ఉపాధ్యాయ మన్నన పొందిన మేటి సంఘంగా వుందని పి ఆర్ టీ యూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాష అన్నారు, ఆయన మాట్లాడుతూ సంఘ ప్రస్థానంలో పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులకు, ప్రభుత్వ ఉపాధ్యాలతో సమానంగా అన్ని సౌకర్యాలు సాధించామని, 010 సాలరీ, ప్యానెల్ గ్రేడ్ పదోన్నతులు, సెలవులు, జిల్లా పరిషత్ హెడ్ మాస్టర్లకు డీడీఓ అధికారాలు, ఎంఈవో, డిప్యూటీ డీఈవో పదోన్నతులు, ఉమ్మడి సర్వీస్ రూల్స్, మహిళలకు 5 ప్రత్యేక సెలవులు, పిల్లల వయస్సుతో సంబంధం లేకుండా 180 రోజుల చైల్డ్ కేర్ లీవ్స్, అప్రెంటిస్ ఉపాధ్యాయులకు 2 నోషనల్ ఇంక్రిమెంట్, 398 స్పెషల్ పే కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్స్, అప్రెంటిస్ రద్దు, మెరుగైన ౖా=జ లు, ఇలా అనేక +ూ లు సాధించి అహిర్నశాలు ఉపాధ్యాయ సంక్షేమం కోసం పాటుపడుతూ, నేటితో 55 వసంతాలు పూర్తి చేసుకుందని తెలిపారు. ఈ రోజు పిఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు పరిధిలో మానవత నిలయం వృద్ధాశ్రమం లోని వృద్ధులకు పండ్లు, ఫలాలు అందించి సేవ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో PRTU రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇబ్రహీం, పి నూర్ మొహమ్మద్, హుస్సేన్ సాహెబ్, ఎస్.వి. రామిరెడ్డి, దామరేకుల రవి , జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం చంద్రశేఖర్ ఆత్మకూరు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సి ప్రదీప్ కుమార్, జి హనుమంతు, కొత్తపల్లి మండల అధ్యక్షుడు సయ్యద్ కలిముల్లా, వెలుగోడు మండల అధ్యక్షుడు సయ్యద్ మొయినుద్దీన్, పాములపాడు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ సాంబ శివుడు, పి హరినాథ్ బాబు, జిల్లా నాయకులు ఖాజా, రఫీక్, శివయ్య మండల కార్యవర్గ సభ్యులు నరేష్, సమద్, అర్షద్. మహబూబ్, కరీం,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ సదస్సు విజయవంతం



**నేటి సాక్షి, తొగుట :** తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామి ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగ ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు పెంచాలని, దళితులకు ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. లీడ్‌క్యాప్, అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం గ్రామస్థాయి కమిటీలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మార్చి 2,3 తేదీల్లో నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లింగాల కృష్ణ మాదిగతో పాటు జిల్లా, మండల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# కొండాపురం నుంచి కబడ్డీ గర్జన

**సీఎం కప్‌లో సంజనకు డివిజన్ టాప్ విజయం**



**నేటి సాక్షి, నల్లబెల్లి :** నల్లబెల్లి మండలం కొండాపురం గ్రామానికి చెందిన కొల్లూరి సంజన క్రీడారంగంలో సరికొత్త వెలుగులు నింపింది. నర్సంపేట మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ఆమె, ముఖ్యమంత్రి కప్ కబడ్డీ పోటీల్లో పాల్గొని నర్సంపేట డివిజన్ స్థాయిలో తొలి స్థానం సాధించింది.గత రెండు సంవత్సరాలుగా నిరంతర సాధనతో తన ప్రతిభను మెరుగుపర్చుకున్న సంజన, పోటీల్లో అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. ఆమె విజయంతో గ్రామమంతా ఆనందోత్సాహాలతో నిండిపోయింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రముఖులు సంజనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. పేద కుటుంబానికి చెందినప్పటికీ కష్టపడి ఎదిగి ఈ స్థాయికి చేరుకోవడం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలిచింది. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోనూ సంజన ప్రతిభ చాటాలని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# అక్రమ నగదు సీజ్

**చెన్నూర్ సీఐ బన్సీలాల్**



**నేటి సాక్షి, చెన్నూర్:** మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు రూ. 1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. చెన్నూర్ మున్సిపల్ 15వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి గుర్రం ఉమారాణి శ్రీనివాస్‌కు సంబంధించిన నగదుగా పోలీసులు గుర్తించారు. స్థానిక ప్రతాప్ మారుతి హనుమాన్ దేవాలయం సమీపంలో సమాచారం మేరకు పట్టణానికి చెందిన పడమటింటి శ్రీనివాస్ అనే వ్యాపారిని తనిఖీ చేయగా రూ. 1.50 లక్షల నగదు లభించింది. విచారణలో తన మిత్రుడు గుర్రం శ్రీనివాస్ అవసరాల కోసం నగదు తీసుకువెళ్తున్నట్లు తెలిపాడు. దీంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకుని ఎన్నికల ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ (ఫ్లూ)కు అప్పగించారు. ఎన్నికల సమయంలో సరైన ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో నగదు తరలిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం సీజ్ చేస్తామని చెన్నూర్ టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు.

# స్మశాన వాటికలో నీటి కొరత

**శాశ్వత పరిష్కారం**

**సర్పంచ్ మకిలీ దాస్ చొరవతో నూతన బోర్ ఏర్పాటు**




**నేటి సాక్షి - మేడిపల్లి:** మేడిపల్లి మండల కేంద్రంలోని స్మశాన వాటికలో గత కొంతకాలంగా నెలకొన్న నీటి కొరత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామ సర్పంచ్ మకిలీ దాస్, గ్రామ పాలకవర్గ సభ్యుల ప్రత్యేక చొరవతో నూతన బోర్ వేయించారు. అంత్యక్రియల సమయంలో నీటి కొరత కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ అభివృద్ధి ధ్యేయంగా నిధులు కేటాయించి, పనులను స్వయంగా పర్యవేక్షించారు. ఈ చర్యపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి సకాలంలో పరిష్కరించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తోపారపు అర్జున్, పంచాయతీ కార్యదర్శి అజయ్ రాజు, కారోబార్ సురేష్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దేశవేని కృష్ణ, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అండాశయ కణితి తొలగింపు

**నాలుగు గంటలపాటు శ్రమించి శస్త్రచికిత్స చేసిన వైద్యులు**





**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు):** జగిత్యాల ప్రభుత్వ మాతా–శిశు ఆసుపత్రి (ఎంసిహెచ్)లో వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి మహిళ కడుపులో ఉన్న పెద్ద అండాశయ కణితిని విజయవంతంగా తొలగించారు. సుమారు నాలుగు గంటలపాటు కష్టపడి నిర్వహించిన ఆపరేషన్ ద్వారా మహిళను ప్రమాదం నుంచి కాపాడారు. 36 ఏళ్ల మహిళ ఎడమ అండాశయంలో పెద్ద కణితితో ఆసుపత్రిలో చేరగా, ఓబీజీ వైద్యులు డాక్టర్ అరుణ, డాక్టర్ మాధవి అన్వేషణాత్మక లాపరోటమీ శస్త్రచికిత్స చేసి కణితిని తొలగించారు. గతంలో మూడు సిజేరియన్ ప్రసవాల చరిత్ర ఉన్న రోగికి అత్యంత జాగ్రత్తగా చికిత్స అందించినట్లు వైద్యులు తెలిపారు. కడుపులో నుంచి తొలగించిన కణితిని నిర్ధారణ కోసం హిస్టోపాథాలజీ పరీక్షకు పంపినట్లు తెలిపారు. వైద్యుల సమయోచిత సేవలతో రోగి సురక్షితంగా బయటపడటంతో కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది వైద్యులను అభినందించారు.

# జల్ది బిందె కార్యక్రమం



**నేటి సాక్షి - నారాయణపేట:** మరికల్ మండలం అప్పంపల్లి గ్రామంలో శివ స్వాముల ఆధ్వర్యంలో జల్ది బిందె కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేత

**రామ సహాయం నరేష్ రెడ్డి**



**నేటి సాక్షి తిరుమలాయపాలెం 9 మెట్టు రుద్రరాజు:** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్ గ్రామంలో సిఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి. సుబ్లేడ్ గ్రామానికి చెందిన గుంజ ఈదమ్మకి మోకాలు ఆపరేషన్ జరిగింది వారికి ఆర్థిక సహాయంగా రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవతో 75 వేల రూపాయలు సీఎంఆర్ఎఫ్ చెక్కుని రామ సహాయం నరేష్ రెడ్డి మరియు సర్పంచ్ సంగబత్తుల స్వాతి సుమన్ రెడ్డి సిఎంఆర్ఎఫ్ చెక్కుని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బత్తుల వెంకటనారాయణ, వార్డు మెంబర్ బండారు రాంబాబు, చారి శ్రీరాములు, కట్టుకూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సొసైటీ డైరెక్టర్ లింగయ్య, కాళ్ల లింగయ్య, బోడ రమేష్, మెట్టు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పి.ఆర్.టి.యు ఆవిర్భావ దినోత్సవం



**నేటి సాక్షి కరీంనగర్:** ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పి.ఆర్.టి.యు) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ లోని సంఘ భవనంలో జిల్లా అధ్యక్షులు అయిలేని కరుణాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్ రెడ్డి లు సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల సాధనలో సంఘం ఎల్లవేళలా ముందంజలో ఉంటూ అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయుల ఆదరాభిమానాలు చూరగొని దేశంలోనే అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా రూపుదిద్దుకొందని, సదా ఉపాధ్యాయుల సంక్షేమానికి సంఘం ఎల్లవేళలా పనిచేస్తుందని తెలియజేశారు. సంఘ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన శ్రీలక్కాకుల వెంకటేశ్వరరావు గారిని ఈ సందర్భంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మండల జిల్లా రాష్ట్ర బాధ్యులు తిరుపతిరెడ్డి, శ్రీకాంత్ రావు, రామ్మోహన్ రావు,శ్రీనివాస్ రెడ్డి,లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు,



జీవన్ రెడ్డి,శ్యామ్ శ్రీనివాసాచారి, బీరయ్య, రవీందర్, వెంకట్రాంరెడ్డి ముజీబ్ రాజశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు

# ఉత్సాహంగా మాక్ పార్లమెంట్

**నేటి సాక్షి నారాయణపేట, ఇమామ్ సాబ్:** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో ని బాలుర ఉన్నత పాఠశాల లో మాక్ పార్లమెంట్ ఎంతో ఉత్సాహంగా జరిగింది. విద్యార్థులే రాష్ట్రపతి స్పీకర్ ప్రధానమంత్రి ప్రతిపక్ష నాయకులుగా వ్యవరించారు.. రాష్ట్రపతిగా హర్షిత, ప్రధానమంత్రిగా అశ్విని, స్పీకర్గా రమ్య, ప్రతిపక్ష నాయకురాలిగా కృష్ణవేణి, కేంద్ర మంత్రులు గా కావేరి, పూజ, సాయి తేజస్విని, అపూర్వ , మేఘన, ఆకాంక్షలు వ్యవహించారు..గైడ్ టీచర్లుగా శివ శంకర్, శ్రీనివాస్లు వ్యవహరించారు. నేటి బాలలే రేపటి పౌరులు...వారు ప్రజాస్వామ్య సూత్రాలను అలవర్చుకోవడంలో ఇలాంటి కార్యక్రమాలు చాల కీలమన్నారు. పాఠశాల ఇంఛార్జి అమరేశ్ మరియు ఇతర ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు కాపాడటంలో పార్లమెంట్ చాల కీలమమని, విద్యార్థులు ప్రజస్వామిక విలువలు పెంపొందించుకోవాలని సూచించారు.గైడ్ టీచర్లని విద్యార్థులను అభినందించారు.

# ఆహార మహోత్సవం



**నేటిసాక్షి,వెల్గటూర్:** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని కుమ్మరిపల్లి మోడల్ స్కూలులో ఫుడ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు.విదార్థులు తమ తమ అభిరుచులకు తగ్గట్లుగా వంటకాలు చేసుకొని వచ్చి ప్రదర్శించారు..తెలంగాణా సంస్కృతిని ప్రతిబింబించేలా పిండి వంటకాలు, సర్వపిండి, శకినాలు వివిధ వంటకాలు ప్రదర్శించి వాటిని తినటం వల్ల కలిగే ప్రయోజనాలు అతిథులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వెల్గటూర్ మండల తహసిల్దార్ శేకర్, ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు..

# ధర్మారం ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నేటి సాక్షి, ధర్మారం :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశాలతో పాటు ఏడవ నుండి పదవ తరగతి వరకు మిగిలిన సీట్ల కోసం అర్హత గల విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్కుమార్ తెలిపారు.తెలంగాణ మోడల్ స్కూల్ అధికారిక వెబ్సైట్ tgmstelanganagovin లో ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఏప్రిల్ 19న ధర్మారం ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఆరో తరగతి పరీక్ష ఉదయం, ఏడవ నుండి పదవ తరగతుల పరీక్ష మధ్యాహ్నం జరుగుతుందని తెలిపారు. వివరాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలను సంప్రదించాలని, అర్హులైన మండల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# జనాలగూడెం బాధితులకు నిత్యవసర వస్తువులు






- కూరగాయలు పంపిణీ చేసిన పి.వి.రావు మాల
- మహానాడు కమిటీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ డి.వెంకటేష్.

**నేటి సాక్షి కొత్తపల్లి:** కొత్తపల్లి మండలంలోని, జానాల గూడెంలో గత నెలలో అగ్రవర్ణాల కుట్రలో భాగంగా దళితులను అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్ కు పంపించడం జరిగింది. వారి కుటుంబాల బాధితులకు అండగా పి.వి.రావు మాల మహానాడు కమిటీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ డి.వెంకటేష్, తదితర నాయకులు పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇవ్వడమే కాకుండా, న్యాయపరంగా బాధితులకు అండగా ఉంటామని మాల మహానాడు నాయకులు హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం జనాల గూడెం బాధితులకు కొంతమంది దాతల సహకారంతో నిత్యవసర వస్తువులు, కూరగాయలు మాల మహానాడు నాయకులతో కలిసి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాములపాడు మండలం నుండి మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.చిన్న అంకన్న, సమాజ సేవకుడు కలబండి.నాగరాజు, జాతీయ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు నల్లమల.అబ్రహం, మిత్తూరు మండలం నాయకులు దేవ, నాగరాజు, జూపాడుబంగ్లా మండలం నాయకులు మాధవరం రంగస్వామి, పి.రంగయ్య, కొత్తపల్లి మండలం నాయకులు మల్రెడ్డి రవికుమార్, మధు, అరే రాజు,తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై అఘాయిత్యం

- నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష 20 వేల రూపాయల జరిమానా.
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా,

**నేటి సాక్షి వికారాబాద్:** వికారాబాద్ జిల్లాలో సంచలనం సృష్టించిన మైనర్ బాలిక లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష 20 వేల రూపాయల జరిమానా విధిస్తూ వికారాబాద్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, వెల్లడించారు. 2023లో వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెం: 150/2023 ప్రకారం.. వికారాబాద్ మండలానికి చెందిన అత్వెల్లి నరేందర్ (అలియాస్ నరేష్) అనే వ్యక్తి ఒక మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు పోక్సో (పోక్సో) చట్టం మరియు ఇతర ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేపట్టారు.ఈ కేసు విచారణ వికారాబాద్లోని మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు గౌరవ న్యాయమూర్తి శ్రీ సి.హెచ్. చంద్ర కిషోర్ గారి సమక్షంలో జరిగింది. పోలీస్ అధికారులు సమర్పించిన శాస్త్రీయ సాక్ష్యాధారాలను పరిశీలించిన గౌరవ న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతనికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు 20 వేల రూపాయల జరిమానా విధించారు. అంతేకాకుండా, బాధితురాలి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పరంగా రూ. 5 లక్షల నష్టపరిహారాన్ని (విక్టిమ్ కాంపిన్సేషన్) అందజేయాలని కోర్టు ఆదేశించింది.నిందితుడికి కఠిన శిక్ష పడేలా పకడ్బందీగా వ్యవహరించిన అధికారులను సిబ్బందిని ఎస్పీ స్నేహ మెహ్రా ప్రత్యేకంగా అభినందించారు. నాటి దర్యాప్తు అధికారులు టి. శ్రీను (అప్పటి వికారాబాద్ సి.ఐ), బి.వి. సత్యనారాయణ (అప్పటి వికారాబాద్ ఎస్డిపిఓ), అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి మెరాజ్ ఫిర్దోస్, ప్రస్తుత సీఐ కె. రఘు కుమార్, కోర్టు లైజనింగ్ ఎస్. నిరంజన్ గౌడ్, భరోసా సెంటర్ ప్రతినిధులు శ్వేత (ఎస్ఐ), కీర్తి ఆకుల,



కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ ఎల్. నరేందర్ (ఏ.ఎస్.ఐ), జి. మణిక్ ప్రభు (పీసీ)లను ఎస్పీ ప్రశంసించారు. మహిళలు చిన్నారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా లేదా నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ గారు ఈ సందర్భంగా హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని ఆమె స్పష్టం చేశారు.

# దయాకర్ రెడ్డి పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



- ఎస్సీ ఎస్టి కమిషన్, మానవ హక్కుల కమిషన్ లను ఆశ్రయించిన బాధితులు.

**నేటి సాక్షి, వికారాబాద్:** బిఆర్ఎస్ నవాబ్పేట్ మండల అధ్యక్షుడు దయాకర్ రెడ్డిపై ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అనూష తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అంబేద్కర్ ప్రజా సంఘం అండతో రాష్ట్ర ఎస్సీ-ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్లకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, పెద్దెముల్ మండలం చైతన్య నగర్కు చెందిన మాదాసు లక్ష్మి-కిష్టయ్య దంపతులు తమ కుమార్తె అనూష (14)తో కలిసి నవాబ్పేట్ మండలం ముబారక్పూర్లో దయాకర్ రెడ్డి వద్ద పొలం పనులు చేస్తున్నారు. జనవరి 28న ట్రాక్టర్పై పనికి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో అనూష అక్కడికక్కడే మృతి చెందింది. బాల కార్మికురాలితో పని చేయించుకోవడం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు ఆరోపించారు. అదే ఘటనలో మమత అనే మహిళకు గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం కొందరిని నిర్బంధించి వేధింపులకు గురి చేస్తున్నారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్పై మాత్రమే కేసు నమోదు చేశారని, ప్రధాన బాధ్యుడైన దయాకర్ రెడ్డిపై అట్రాసిటీ, బాల కార్మిక చట్టాల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ప్రజా సంఘం నాయకులు మాట్లాడుతూ చట్టాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దయాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసే వరకు న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎల్లవేళలా అందుబాటులో ఉండే బీఆర్ఎస్ అభ్యర్థులను ఎన్నుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్.



**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా సోమవారం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గుడుపల్లి (7వ వార్డు), మద్గుల్ చిట్టెంపల్లి (8 వార్డు) ఎన్నెపల్లి (3వ వార్డు)లలో ప్రచారంలో పాల్గొన్న వికారాబాద్ జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ..గడిచిన రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం వికారాబాద్ పట్టణానికి చేసిందేమి లేదు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారానికి మీ దగ్గరికి వచ్చి ఓట్లు అడుగుతున్న ఈ కాంగ్రెస్ నాయకులు ఏ ఒక్కరైనా గడిచిన రెండు సంవత్సరాల్లో మీ దగ్గరకు వచ్చారా..? మీ సమస్యల పట్ల ఆరా తీశారా?దయచేసి ఆలోచించండి ఎన్నికల సమయంలో కాకుండా ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉండే బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులను ఎన్నుకోండి. బీజేపీ కి ఓటు వేసిన అది పరోక్షంగా కాంగ్రెస్ పార్టీకి వెళుతుంది.ఒకప్పుడు కలెక్టర్ కార్యాలయంలో ఉండే ప్రతి పనికి హైదరాబాద్ కు వెళ్లి పడిగాపులు పడాల్సిన అవసరం ఉండేది. కెసిఆర్ వల్లే వికారాబాద్ జిల్లా ఏర్పడింది. వికారాబాద్ జిల్లా ఏర్పాటుతో ఎన్నో కష్టాలు తీరాయి.ప్రస్తుతం వికారాబాద్ జిల్లాను తీసెయ్యాలి అని రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నాడు.భవిష్యత్ లో కలెక్టర్ కార్యాలయంలో ఏదైనా అవసరం ఉంటే మళ్ళీ ఎక్కడో హైదరాబాద్ కు వెళ్ళాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసలవల్ల నష్టపోయిన ప్రజలు మళ్ళీ కెసిఆర్ గారిని కోరుకుంటున్నారు. రాష్టంలో కెసిఆర్ రావాలంటే ఆ మార్పు మనం ఈ ఎన్నికల నుండే మొదలు పెడుదాంబీ ఆర్ ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను కౌన్సిలర్లుగా ఎన్నుకుందాం అని పిలుపునిచ్చారు.

# ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు వినియోగించాలి




**నేటి సాక్షికొమురం భీంఆసిఫాబాద్ :**మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని ఓటుహక్కు పాల్గొని ఓటు వినియోగించుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు సోమవారం కాగ జ్ నగర్ పట్టణం లో నిర్వహించిన పోలీస్ ఫ్లాగ్ మార్చ్ లో ఎస్పీ నితిక పంత్ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం ముగిసిందని, పోలింగ్ ఏర్పాట్లలో అధికారులు సిబ్బంది నిమగ్నం అయ్యారని చెప్పారు.ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించాలని కోరారు. ప్రలోభాలను అడ్డుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలింగ్‌కి ముందు, పోలింగ్ నాడు ఓటర్లను ప్రలోభపెట్టడం, ప్రభావితం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎటువంటి సమాచారం ఉన్నా స్థానిక ఎన్నికల అధికారులకు, కంట్రోల్ రూమ్‌కి సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్పీ నితిక పంత్ మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుసుకోవాలని కోరారు. ఎన్నికల పోలింగ్ కి పకడ్బందీ నిఘా, బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.ఈ ఫ్లాగ్ మార్చ్ పట్టణం లోని పలు కూడళ్ల గుండా సాగింది. సీఐలు ప్రేమ్ కుమార్, సంతోష్, కుమారస్వామి, ఎస్ఐ లు పాల్గొన్నారు.


# యూరియా యాప్ పై రైతులకు అవగాహన సదస్సు



**నేటి సాక్షి చిలుకూరు:** చిలుకూరు మండలం పాలేఅన్నారం సొసైటీ పరిధిలో ఉన్న నారాయణపురం సీతారామపురం శీతలతండా గ్రామ రైతు సోదరుల ఆధ్వర్యంలో రైతులకు యూరియా యాప్ అవగావన సదస్సు కార్యక్రమంనకు సంఘ పరిది లో ఉన్న గ్రామ సర్పంచ్లు ఉప సర్పంచ్ లు ముఖ్య అతిధిలుగా రావడం జరిగింది. పాలేఅన్నారం లో నడపబడుచున్నటువంటి సంఘం సొసైటీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ మూడు గ్రామాల సర్పంచ్ ఉప సర్పంచ్ లకు బ్యాంకు స్టాప్ వారిచే సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. ఈ యొక్క సన్మాన కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న గ్రామ పెద్దలు పాల్గొని సొసైటీని అన్ని రకాలుగా ముందుకు తీసుకుపోతామని అదేవిధంగా నారాయణపురం గ్రామ సర్పంచ్ మండవ జయమ్మ మాట్లాడుతూ మా గ్రామంలో మా రైతులకు యూరియా ఇబ్బంది లేకుండా చూడాలి అని కోరడమైనది సీతారాంపురం గ్రామ సర్పంచ్ పుల్లం శైలజ లక్ష్మి నారాయణ సీతారాంపురం గ్రామం లో గోదాం ఏర్పాటు చేసి దానిద్వారా రైతులకు కావలసిన ఎరువులు మా దగ్గరే ఇవ్వాలని అడగడం జరిగినది జరిగింది దానికి సొసైటీ సిఈ ఓ స్పందిస్తూ మీ గ్రామం లో స్థలం కేటాయిస్తే జిల్లా అధికారులు తో మాట్లాడి తప్పనిసరిగా గోదాం నిర్మించే విదంగా చూస్తాం అని చెప్పడం జరిగింది రైతులకు కావలసిన ఎరువులను అందుబాటులో ఉంచి ఇస్తామని తెలియజేయడం జరిగినది సీతల తండా గ్రామ సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ సీతల తండా గ్రామ ప్రజలు యూరియా కోసం అనేక ఏండ్లు గా ఇబ్బందులకు గురి అవుతున్నారు వారి యొక్క చీరకాల కోరిక తండాలో గోదాం నిర్మాణం దీనికోసం మన ఎమ్మెల్యే తో మాట్లాడి కచ్చితంగా నిర్మాణం చేసి వచ్చేవానాకాలం సిజన్ వరకు అందుబాటులోకి వచ్చే విదంగా. చేస్తాం అని చెప్పడం జరిగింది. ఈ యొక్క సమావేశం లో ఉప సర్పంచ్ లు గంద్ర లింగస్వామి నునవత్ శకుంతల గన్న ప్రవీణ్ మూడు గ్రామల పెద్దలు రైతులు పాల్గొన్నారు

## బాలికపై దారుణానికి నిరసన

### నల్లబెల్లి తాసిల్దార్‌కు విజ్ఞాపన పత్రం



**నేటి సాక్షి,నల్లబెల్లి :** నల్లబెల్లి మండల కేంద్రంలోని రెవిన్యూ తాసిల్దార్ కార్యాలయంలో బాధిత బాలికకు న్యాయం చేయాలంటూ విజ్ఞాపన పత్రం అందజేశారు. తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పొనగండ్ల గ్రామంలో ఎనిమిదేళ్ల బాలికపై జరిగిన అత్యాచారం సభ్య సమాజాన్ని కలచివేసిందన్నారు. నిందితులను వెంటనే గుర్తించి కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కల్పించాలని కోరారు. బాలిక వైద్య ఖర్చులన్నీ రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని అన్నారు. సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి దోషులకు కఠిన శిక్షలు విధించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పరికిరత్నం, యువ నాయకుడు ప్రకాష్, మేరు సంఘం కార్యదర్శి ఓదెల రవి, జితేందర్, ప్రకాష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ దేవమ్మ ఆలయానికి విద్యుత్ వెలుగు

### అధికారుల తక్షణ స్పందనకు గ్రామస్థుల హర్షం



**నేటి సాక్షి, నల్లబెల్లి :** మేడపల్లి గ్రామంలోని ఊర చెరువు సమీపంలో ఉన్న లక్ష్మీ దేవమ్మ (సత్తియాడి) ఆలయానికి విద్యుత్ సదుపాయం కల్పించేందుకు అధికారులు వెంటనే స్పందించారు. కరెంట్ ఎ డి , ఐ.జు స్వయంగా ఆలయాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ఆలయానికి విద్యుత్ లైన్ ఏర్పాటు విషయంలో సానుకూల నిర్ణయం తీసుకున్నారు. దీంతో భక్తులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నాళ్లుగానో ఉన్న సమస్యకు పరిష్కారం దిశగా అడుగు పడిందని తెలిపారు. ప్రభుత్వ అధికారుల స్పందన అభినందనీయమని గ్రామ పెద్దలు ప్రశంసించారు.

# కేసీఆర్‌ను తిడితే పాతాళంలో ఉన్నా వదలబోం

- మహబూబాబాద్ రోడ్ షోలో కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

**నేటి సాక్షి, మహబూబాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం పరాకాష్టకు చేరింది. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబాబాద్‌లో జరిగిన రోడ్ షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యర్థులపై విరుచుకుపడ్డారు. ”మమ్మల్ని తిడితే భరిస్తాం కానీ.. కేసీఆర్‌ను తిడితే మాత్రం సహించేది లేదు. అరేయ్ పొట్టోడా.. నువ్వు ఏ దేవుళ్లకు మొక్కుకున్నా, పాతాళంలో దాక్కున్నా వదిలిపెట్టం” అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి.

### ప్రశ్నిస్తే బెదిరింపులా?

ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న తరుణంలో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య బాధ్యతాయుతమైన చర్చ జరగాల్సింది పోయి, వ్యక్తిగత దూషణలకు దిగడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణా, భూముల అన్యాక్రాంతం, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ వంటి అంశాలపై ప్రజల్లో అసంతృప్తి నెలకొన్న తరుణంలో నేతల భాష హద్దులు దాటడం చర్చనీయాంశమైంది.

### దిగజారుతున్న రాజకీయ సంస్కృతి!



నేతలు దేవుళ్లు కాదని, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉందని మేధావులు గుర్తు చేస్తున్నారు. ఎన్నికల వేళ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా, బెదిరింపు ధోరణితో మాట్లాడటం ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రజల్లో భయాన్ని కలిగిస్తాయో లేక ప్రశ్నించే గొంతుకను మరింత పెంచుతాయో వేచి చూడాలి.

## తీర్థయాత్రికు ప్రత్యేక రైలు

### టూర్ ప్యాకేజీలు



**నేటి సాక్షి, మంచిర్యాల:** తీర్థయాత్రికుల సౌకర్యార్థం ఐఆర్‌సిటిసి ప్రత్యేక “భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు” ప్యాకేజీలను ప్రవేశపెట్టినట్లు సికింద్రాబాద్ అసిస్టెంట్ మేనేజర్ పి.వి. వెంకటేష్ తెలిపారు. నస్పూర్‌లో జిల్లా పౌర సంబంధాల కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. మార్చి 21 నుంచి 28 వరకు దివ్యదక్షిణ యాత్ర (తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి తదితర క్షేత్రాలు), ఏప్రిల్ 14 నుంచి 24 వరకు సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర (ఉజ్జయిని, ద్వారక, సోమనాథ్, నాసిక్ తదితర ప్రాంతాలు) నిర్వహించనున్నారు. ప్యాకేజీలలో రైలు, బస్సు, వసతి, భోజనాలు, దర్శన ఏర్పాట్లు, భీమా, భద్రతా సౌకర్యాలు ఉంటాయి. టికెట్ ధరలు సాధారణ, 3ఏసీ, 2ఏసీ తరగతులుగా ఉంటాయని, వివరాలకు 9701360701, 9281030727, 9281030759 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు

## పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



**నేటి సాక్షి, వికారాబాద్:** మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ మరియు జనరల్ అబ్జర్వర్ జి. రవి సమక్షంలో సోమవారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ చేపట్టారు. వికారాబాద్, తాండూర్, కొడంగల్, పరిగి మున్సిపాలిటీలకు సంబంధించిన ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఈఓ రేణుకా దేవి మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వికారాబాద్ మున్సిపల్ ఎన్నికలు

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రోడ్ షో



**నేటి సాక్షి, వికారాబాద్:** వికారాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ వార్డు అభ్యర్థులకు మద్దతుగా స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం రోడ్ షో నిర్వహించారు. 10, 31, 32, 33, 34 వార్డుల పరిధిలోని శివరాం నగర్, బీటీఎస్, అనంతగిరి పల్లి చెంచు కాలనీ, అయ్యప్ప కాలనీ, వెంకటేశ్వర కాలనీలలో ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలిసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, స్థానికంగా తాను ఎమ్మెల్యే మరియు స్పీకర్ హోదాలో ఉన్నానని, మున్సిపల్ చైర్మన్‌గా గడ్డం అనన్య పనిచేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు గెలిస్తే వార్డుల అభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి ఇప్పటికే రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయించామని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్తు, త్రాగునీటి పనులకు ప్రతి వార్డుకు రూ.2 కోట్ల చొప్పున కేటాయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్ అభ్యర్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## గౌరవ డాక్టరేట్ నామినేషన్లు

**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు):** లూసియానా యూనివర్సిటీ (అమెరికా) ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి గాను సమాజంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి గౌరవ డాక్టరేట్‌తో పాటు అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డు, జనరల్ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర కోఆర్డినేటర్ డా. కాయితి శంకర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అవార్డుల ప్రదాన కార్యక్రమం మార్చి 8న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం 9491322556 నంబర్‌ను సంప్రదించాలని



# బిఆర్ఎస్‌ను గెలిపించండి

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**



**నేటిసాక్షి, చేర్యాల :** మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని, ఈ ఎన్నికల్లో ఓటుతో గట్టి బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం చేర్యాలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలతో గాంధీ చౌరస్తా నుండి హనుమాన్ టెంపుల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే పల్లా, కారు గుర్తుకు ఓటేసి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే బీఆర్ఎస్ మద్దతిచ్చిన సీపీఎం సుత్తికోడవలి గుర్తుపై గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రెండేళ్ల రేవంత్ సర్కార్లో ప్రజలెవరూ ప్రశాంతంగా లేరని, ఆచరణకు సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం 420 ప్రభుత్వంగా మారిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో షాదీముబారక్, రంజాన్ తోఫా, కమ్యూనిటీ హాళ్లు వంటి పథకాలు అమలయ్యాయని గుర్తు చేశారు. ప్రస్తుతం రోడ్లు అధ్వానంగా మారడం, కరెంటు కోతలు, చెత్త సమస్యలు పెరగడం అభివృద్ధి కాదని ప్రశ్నించారు. మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగిరితేనే చేర్యాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# నగలు దొంగలించిన మహిళ

**నేటి సాక్షి తిరుమలాయపాలెం మెట్టు రుద్రరాజు:** తిరుమలాయపాలెం మండల పరిధిలోని హైదర్ సాయి పేట గ్రామంలో 22 డిసెంబర్ 2025వ తారీకున చల్లా వసంత ఇంట్లో పట్టపగలు దొంగతనాలకు పాలుబడి బీరువాలో మూడు తులాల స్వాతి హారం దొంగలించారు. బాధితురాలు చల్ల వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా అనుమానంగా ఉన్న కొంతమందిని విచారించగా అట్టి విచారణలో భాగంగా అదే గ్రామానికి చెందిన మహిళ పసల మమత (భర్త ఉప్పలయ్య) తానే నేరం చేశారని ఒప్పుకోవడం జరిగింది. తను దొంగలించిన హారాన్ని సోమవారం పోలీస్ స్టేషన్ లో స్వాధీన పరుచుకున్నారు అట్టి చోరీ చేసిన బంగారం విలువ సుమారు మూడు లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు నేరస్తురాలిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు.

# పదవ తరగతి పరీక్షలపై

**సమీక్ష సమావేశం**



**నేటి సాక్షి చిలుకూరు:** చిలుకూరు మండల కేంద్రంలో ఎంపీడీవో ఆఫీస్ నందు మార్చ్. 2026 పదో తరగతి పబ్లిక్ పరీక్షలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో 100% శాతం ఉత్తీర్ణత తగ్గకుండా చూసుకోవాలని. ఎంఈఓ ఎం గురువయ్య అన్నారు. మండలంలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందరూ కలిసికట్టుగా విద్యార్థులలో 75%ఉత్తీర్ణత తగ్గకుండా చూసుకోవాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో. ఎమ్మార్వో ధ్రువ కుమార్ ఎంపీడీవో గిరిబాబు హెచ్ఎంలు ఏ కరుణాకర్ రెడ్డి నరసింహారెడ్డి శివ కుమారి గౌసిద్దీన్. హనుమంతరావు. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు...

# 16.44 లీటర్ల మద్యం స్వాధీనం

**కేసు నమోదు టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు**



**నేటి సాక్షి,నారాయణపేట, ఇమామ్ సాబ్ :** మున్సిపల్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నారాయణపేట టౌన్ పరిధిలో పోలీసుల తనిఖీలలో పెరపల్ల గ్రామానికి చెందిన సాయికుమార్ గౌడ్ అనే వ్యక్తి వద్ద నారాయణపేట పట్టణంలోని శాసనపల్లి రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న 16.44 లీటర్ల మద్యంను పోలీసులు స్వాధీనం చేసుకొని అట్టి వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగిందని టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం రవాణా, నిల్వలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ధర్మపురి మున్సిపాలిటీపై ఎగిరేది గులాబీ జెండానే



- **కాంగ్రెస్ వైఫల్యాలే మా విజయానికి పునాది**
- **బీఆర్ఎస్ శ్రేణుల ధీమా**

**నేటి సాక్షి, జగిత్యాల గుండ ప్రశాంత్ గౌడ్:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారం తుది అంకానికి చేరుకోవడంతో ధర్మపురిలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ఈ ఎన్నికల్లో ధర్మపురి మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని పెగడపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఇంటింటి ప్రచారంతో హోరెత్తిన వార్డులు సోమవారం ధర్మపురి పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ పార్టీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ధర్మపురి అభివృద్ధికి చేసింది శూన్యం" అని విమర్శించారు. అభివృద్ధి వర్సెస్ శూన్యం బీఆర్ఎస్ హయాంలోనే ధర్మపురి ఆధ్యాత్మికంగా, మౌలిక సదుపాయాల పరంగా ఎంతో అభివృద్ధి చెందిందని నాయకులు గుర్తు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని, ఆ అసంతృప్తి ఓట్ల రూపంలో తమకు లాభిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. అత్యధిక మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లోకమల్లారెడ్డితో పాటు కోరుకంటి రాజేశ్వరరావు, ఇరుగురాల ఆనందం, ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, ఉప్పులంచ లక్ష్మణ్, సాయిని రవీందర్, నాగుల రాజశేఖర్ గౌడ్, కరుణాకర్ రావు, శ్రీనివాస్, వెల్మ సత్యనారాయణ రెడ్డి, తిరుపతి, వీరేశం, రాజిరెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రామ్ జి 2025 చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

- **ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి**
- **ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్ మందడి ఇజ్రాయిల్**

**నేటి సాక్షి తిరుమలయపాలెం మెట్టు రుద్రరాజు:** వ్యవసాయ కూలీలకు జీవనాధారంగా కాంగ్రెస్ యూపీఏ హయాంలో వామపక్షాల సహకారంతో తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం తెచ్చిన విబిజి రాంజీ 2025 చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ప్రజాసంఘాల జేఏసీ కన్వీనర్ మందడి ఇజ్రాయిల్. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న పేద ప్రజల, వ్యవసాయ కూలీల పని భద్రతకు తీవ్ర ఆటంకం కలిగించే, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విబిజి రాంజీ 2025 చట్టాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత రెండు దశాబ్దాలుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా లక్షలాదిమంది పేద వ్యవసాయ కార్మికులకు పని కల్పిస్తూ జీవనాధారంగా మారిందన్నారు. నేడు బిజెపి తెచ్చిన విబిజి రాంజీ చట్టం ద్వారా వ్యవసాయ కార్మికులు జీవనోపాధి కోల్పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పథకం ద్వారా గతంలో 90 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు 10 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వ్యవసాయ కార్మికులకు పని కల్పించగా నేడు 60 శాతం కేంద్రం 40 శాతం రాష్ట్రాలు భరించాలనే విధానంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు పూనుకుందన్నారు. ఈ బిల్లు ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రాంతాల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వాలు పని కల్పించాలని మిగిలిన రాష్ట్రాలలో వ్యవసాయ కూలీల పని హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గ్రామపంచాయతీ ప్రణాళికలు బ్లాక్ జిల్లాస్థాయిలో నేషనల్ రూరల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ స్టాక్స్ లో కలుపుతారని తద్వారా గ్రామంలోని అవసరాలు కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా మారుతుందన్నారు. ఇలాంటి అనేక అంశాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే హక్కుని పేద ప్రజల కుటుంబ జీవనాన్ని ఈ బిల్లు విచ్ఛిన్నం చేసే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసి పేద ప్రజలకు పని హక్కు కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధాతథంగా కొనసాగించాలని, లేనియెడల వ్యవసాయ కూలీలు, రైతులను, పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఉద్యమాలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఇటీవల జరిగిన ఓపెన్ ఫారంలో అధికారులకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించినట్లు ఆయన తెలిపారు . జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారిని రెగ్యులర్ పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు . ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ హక్కులను పౌర హక్కులను ప్రజాస్వామ్యకులను కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉన్న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే సావిత్రి సమ్మెను విజయవంతం చేయాలని దీనిలో ప్రజాస్వామ్య వాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ప్రజాసంఘాల జేఏసీ కన్వీనర్ మందడి ఇజ్రాయిల్ కోరారు



# సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు తగదు...



- **మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దూడ శ్రీకాంత్**

**నేటి సాక్షి:కమలాపూర్:** TPCC ఉపాధ్యక్షులు, మీజ బల్మూరి వెంకట్ ఆదేశాల మేరకు ఈరోజు కమలాపూర్ పోలీస్ స్టేషన్లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన TRS పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీద పిర్యాదు చేసిన కమలాపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దూడ శ్రీకాంత్ ఈ కార్యక్రమంలో మాట్ల రవీందర్,ఇల్లంతకుంట దేవస్థానం డైరెక్టర్ & మరిపెల్లి గూడెం సమ్మక్క సారలమ్మ చైర్మన్ రిక్కల నారాయణ రెడ్డి,సీనియర్ నాయకులు కొండ తిరుపతి మరియు కమలాపూర్ యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్ల రాజేష్, శనిగరపు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైంది

**నేటి సాక్షి, జగిత్యాల గుండ ప్రశాంత్ గౌడ్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని,ధర్మపురి మున్సిపల్ పై బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని గొల్లపల్లి మండల బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు అన్నారు ధర్మపురి పట్టణంలోని 6.7.8. వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ విస్తృత ప్రచారం చేశారు.ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు

బీఆర్ఎస్. చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలను ప్రజలకు.వివరించారు.అనంతరం.బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హాయంలోనే ధర్మపురి ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన ధర్మపురి కు చేసింది శూన్యం అన్నారు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఏ ఒక్క పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే తమ పార్టీ అభ్యర్థులను.గెలిపిస్తాయని,ధర్మపురి మున్సిపల్ పై బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ధర్మపురి పట్టణ ప్రజలు ఆలోచించి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో.మాజీ



ఎంపీపీ నక్క శంకయ్య మాజీ,జడ్పీటీసి గోస్కుల జలంధర్, సింగిల్ విండో చైర్మన్ చెందోలి మాధవ్ రావు రైతు సమన్వయ జిల్లా కమిటీ మెంబర్ ఓరగంటి అశోక్ రావు ,బొంకూర్ మాజీ సర్పంచ్ కందుకూరి సత్తయ్య రాపల్లి మాజీ సర్పంచ్ నల్ల శ్యామ్ ,రాపల్లి ఎంపీటీసీ కోక్కుల భుమయ్య,బత్తిని సత్యానారయణ గౌడ్,పొనగంటి రాజా రత్నం, జనుప వెంకటేష్ గొల్లపల్లి మండలం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# ‘పెండెం గణేష్’

## ఇట్స్ ఏ బ్రాండ్!

### కోరుట్ల 31వ వార్డులో ‘పీజీ’బ్రాండ్‌గా మారిన బీజేపీ కౌన్సిలర్

- కరోనా కష్టకాల సేవల నుంచి.. కమలం గుర్తుతో మరోసారి ప్రజల విశ్వాసం దిశగా..
- అభివృద్ధి పనులు.. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ‘వార్డు ప్రజల్లో’ తలలో నాలుక
- మరోసారి ఆశీర్వాదిస్తే.. మరింత డెవలప్‌మెంట్








“కోరుట్ల పట్టణ రాజకీయాల్లో యువత ఉత్సాహానికి, ప్రజల ఆశలకు ప్రతీకగా నిలిచిన పేరు.. ‘పెండెం గణేష్..’! కరోనా మహమ్మారి సమయంలో ‘సేవ’నే ఆయుధంగా ప్రజల మధ్య నిలిచిన ఆయన... ఆ తర్వాత ఇంటింటా ప్రచారం, నిరంతర ప్రజాసంబంధాలు, అభివృద్ధిపై దృష్టితో ఒక్కసారిగా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారు. ‘కమలం గుర్తుకే మన ఓటు’ అనే నినాదంతో యువతను ఒక్కతాటిపైకి తెచ్చిన ఈ యువ నాయకుడు... ఇప్పుడు కోరుట్ల 31వ వార్డులో మరోసారి బరిలోకి దిగి గెలుపు కోసం తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు..”

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

## కరోనా కాలంలో సేవే రాజకీయం

2020–2021 మధ్య కరోనా మహమ్మారి ఉధృతంగా ఉన్న సమయంలో, పెండెం గణేష్ ప్రజల మధ్య ప్రత్యక్షంగా నిలిచారు. ఆహార ప్యాకెట్లు, మందులు, అత్యవసర సామగ్రి పంపిణీ చేయడమే కాకుండా, మాస్కులు, సానిటైజర్లు అందిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆ కష్టకాలంలో వార్డు ప్రజలకు ధైర్యంగా నిలిచిన ఆయనకు స్థానికంగా “జూం×ణ ఝితీతీఅశీతీ”గా ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ సేవాభావమే ఆయన రాజకీయ ప్రయాణానికి బలమైన పునాది అయింది.

## కోరుట్లలో బీజేపీ ఉనికికి బలం.. 31వ వార్డు కథ!

జగిత్యాల జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో ఒకటైన కోరుట్ల మున్సిపాలిటీలో 31వ వార్డు రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత కలిగినది. ఈ వార్డు నుంచే భారతీ–య జనతా పార్టీ తరపున ప్రజాసేవలో ఉన్న కౌన్సిలర్ పెండెం గణేష్ గత కొన్ని సంవత్సరాలుగా స్థానికంగా ప్రత్యేక గుర్తింపును సంపాదించారు. యువతతో సన్నిహితంగా ఉంటూనే, కుటుంబాల సమస్యలను దగ్గరగా తెలుసుకుంటూ ముందుకు సాగుతున్న నాయకుడిగా ఆయన పేరు స్థిరపడింది.



## రాజకీయ ప్రయాణం.. 2019 గెలుపుతో మొదలైన అధ్యాయం

2019 మున్సిపల్ ఎన్నికల్లో 31వ వార్డు నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన పెండెం గణేష్, యూఆర్ (జనరల్) కేటగిరీలో విజయం సాధించి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యారు. ఆ గెలుపు కోరుట్లలో బీజేపీకి బలమైన ఉనికిని చాటింది. ఆ తర్వాత కౌన్సిలర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన, 2026లో జరిగిన తాజా మున్సిపల్ ఎన్నికల్లోనూ మళ్లీ బీజేపీ తరపున పోటీ చేసి ప్రజల మద్దతుతో బలంగా నిలబడ్డారు.



## ప్రచారం, ప్రజాసంబంధాలు - “Team PG” స్టైల్.!

ఎన్నికల సమయంలో ‘Team PG’ పేరుతో అభిమానులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నామినేషన్ రోజు నుంచే ర్యాలీలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారాలతో పాటు సోషల్ మీడియా ద్వారా ఓటర్లతో నిరంతరంగా కనెక్ట్ అయ్యారు. ‘Vote for BJP, Vote for Pendem Ganesh’, ‘కమలం గుర్తుకే మన ఓటు’ వంటి నినాదాలు ప్రచారానికి ప్రధాన ఆయుధంగా మారాయి.

## యువతలో ప్రత్యేక గుర్తింపు - ‘పెండెం గణేష్ యువ సేనా’

యువతను రాజకీయంగా, సామాజికంగా సంఘటితం చేయాలనే ఉద్దేశంతో ఏర్పడిన ‘పెండెం గణేష్ యువ సేనా’ 31వ వార్డులో చురుకైన పాత్ర పోషిస్తోంది. హిందూ సంస్కృతి, జాతీయ భావన, బీజేపీ ఆదర్శాలతో యువతను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ సంఘం ప్రధాన లక్ష్యం. ఎన్నికల సమయంలో ‘Team PG’తో కలిసి పనిచేస్తూ బీజేపీ బలోపేతానికి యువ సేనా కీలకంగా మారింది.







## మౌలిక సదుపాయాలపై దృష్టి

అభివృద్ధి లక్ష్యంగా కౌన్సిలర్‌గా పెండెం గణేష్ 31వ వార్డులో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. రాత్రివేళ వీధి దీపాల లేమితో ఇబ్బందిపడుతున్న ప్రాంతాల్లో మెరుగుదల చర్యలు చేపట్టారు. చిన్న రోడ్లు, లేన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు చేసి పనులు ముందుకు తీసుకెళ్లారు. వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాల్లో డ్రైనేజీ శుభ్రపరిచే పనులు నిర్వహించారు.'మిషన్ భగీరథ' నీటి సరఫరాలో ఉన్న లోపాలను గుర్తించి, పైప్‌లైన్ సమస్యలపై వెంటనే స్పందించారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయిస్తూ ప్రజలకు ఇబ్బందులు తగ్గించే ప్రయత్నాలు చేశారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తూ, చెత్త సేకరణ, డ్రైనేజీ శుభ్రతపై చర్యలు తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వార్డులో సక్రమంగా అమలయ్యేలా కౌన్సిలర్‌గా సహకారం అందించారు.

## సేవతో నాయకత్వం - భవిష్యత్తుపై ఆశలు


ఒక సాధారణ యువకుడిగా మొదలైన పెండెం గణేష్ ప్రయాణం... ఈ రోజు ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన నాయకుడిగా ఎదిగింది. సేవ, ఉత్సాహం, నిరంతర ప్రజాసంబంధాలతో కోరుట్ల 31వ వార్డును మరింత ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఆయన సాగుతున్న ప్రయాణం యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. భవిష్యత్తులో మరింత పెద్ద బాధ్యతలు చేపట్టే నాయకుడిగా ఆయన ఎదుగుతారని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.మరోసారి ‘కౌన్సిలర్’గా గెలిపిస్తే కోరుట్ల 33 వార్డుల్లో 31 వ వార్డును ‘అభివృద్ధిలో ఒకటవ’ స్థానంలో ఉంచుతానని ‘గణేష్’ హామీనిస్తున్నారు.!!



## అభివృద్ధితోపాటు-ఆధ్యాత్మిక సౌరభాలు

గణేష్ హయాంలోనే చిన్నగా.. శిథిలావస్థలో ఉన్న ‘దుర్గాదేవి’ గుడిని ఆధునీకరించి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. ప్రతీయేటా ‘నవరాత్రోత్సవాలను’ వైభవోపేతంగా నిర్వహిస్తూవస్తున్నారు. పూజలు.. వ్రతాలు.. సామూహిక కుంకుమార్చనలు.. బతుకమ్మ వేడుకలు.. మహనీయుల స్మరణీయ కార్యక్రమాలు వంటి ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకునేలా ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారు.అదేవిధంగా వార్డు అభివృద్ధికి సిసిరోడ్లు.. మురికికాలువలు.. వీధిదీపాలు.. ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పిస్తూ ‘పిలిస్తే పలికేంత’ దూరంలో అందుబాటులో ఉండే గణేష్ కు 31 వ వార్డులో మంచి ఫాలోయింగ్ ఉందనడంలో అతిశయోక్తి లేదు.!





# 'అన్నం' పెట్టే 'చేయి' 'అనిల్' అన్నది!

- కోరుట్ల రాజకీయాల్లో 'అన్నం'ది విభిన్న శైలి
- సేవకు ప్రతిరూపంగా నిలిచిన నేత - 'అన్నం అనిల్'
- రాజకీయ మార్పుల మధ్యలోనూ సేవా దృక్పథం మారనివ్వని 'అన్నం' నాయకత్వం

"అడిగినవారికి లేదనకుండా 'అన్నం' పెట్టే మనసు... అవసరంలో ఉన్నవారికి అండగా నిలిచే స్వభావం... రాజకీయాల్లో ఉన్నా మానవత్వాన్ని మర్చిపోని వైఖరి... ఈ లక్షణాలే కోరుట్ల పట్టణంలో 'అన్నం అనిల్'ను ప్రత్యేకంగా నిలబెట్టాయి.! ఒక సాధారణ నాయకుడిగా మొదలెట్టిన ప్రయాణం, మున్సిపల్ చైర్‌పర్సన్ (భార్య అన్నం లావణ్య) పదవికి చేరి, రాజకీయ మలుపుల మధ్యనూ ప్రజలతోనే ఉండే నాయకత్వంగా ఎదిగింది. కోరుట్ల రాజకీయాల్లో 'అన్నం' పెట్టే నాయకుడి'గా ఆయన పేరు చెరగని ముద్ర వేసుకుంది.'అన్నం అనిల్' పరిపాలనలో.. రాజకీయాల్లో..ప్రజాక్షేత్రంలో తనదైన ముద్ర వేస్తూ 'ఓ-బ్రాండ్'గా వెలుగొందుతున్నారు.!

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

## కుటుంబం నుంచే ప్రజాసేవకు పునాది

కోరుట్ల పట్టణానికి చెందిన ప్రముఖ కుటుంబంలో జన్మించిన అన్నం అనిల్ రాజకీయాలు-సామాజిక సేవల వాతావరణంలోనే ఎదిగారు. అన్నం అనిల్ రాజకీయాల్లో చు-రుకైన నేతగా గుర్తింపు పొందారు. బీఆర్ఎస్ (మాజీ టీఆర్ఎస్) పట్టణ అధ్యక్షుడిగా, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్‌గా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పనిచేసిన అనిల్, పట్టణంలో బలమైన సామాజిక-రాజకీయ నెట్‌వర్క్‌ను నిర్మించారు. 'అన్నం లావణ్య-అనిల్' అనే ఈ దంపతులిద్దరూ కలిసి ప్రజలతో మమేకమై, సేవే లక్ష్యంగా ముందుకు సాగారు. కుటుంబ బాధ్యతలతో పాటు ప్రజా జీవితాన్ని సమతుల్యం చేయడంలో లావణ్య-అనిల్'లు అనేక కుటుంబాలకు స్ఫూర్తిగా నిలిచారు.


## నేటి స్థితి... రేపటి ఆశ.!

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో జువ్వాడి నర్సింగరావు నేతృత్వంలో చురుకైన పాత్ర పోషిస్తున్న అన్నం అనిల్ ప్రభుత్వ పథకాల ప్రచారం, పార్టీ కార్యక్రమాలు, సామాజిక సేవల్లో ముందుండి పనిచేస్తున్నారు. రాజకీయ, సామాజిక రంగాల్లో యాక్టివ్‌గా కొనసాగుతున్నారు. కోరుట్ల మున్సిపల్ పరిధిలోని 26 వార్డు ప్రజల కే గాక..అవసరమై.. ఆపదలో ఉన్న వారెవరు వచ్చినా.. 'అన్నం' పెట్టే నాయకత్వం'గా వారికి ఉన్న ఆదరణ ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది.!



## సామాజిక సేవల్లో ముందుండే నాయకత్వం

రాజకీయ పదవులకే పరిమితం కాకుండా, సామాజిక సేవలలోనూ లావణ్య గారు చురుకైన పాత్ర పోషించారు. మహిళల సమస్యలు, స్థానిక అర్చకుల సమస్యలు, పట్టణానికి సంబంధించిన అత్యవసర అంశాలపై స్పందిస్తూ పరిష్కార దిశగా కృషి చేశారు. ప్రజలతో నేరుగా మాట్లాడే తత్వం, సమస్యలను శ్రద్ధగా వినడం, వెంటనే చర్యలు తీసుకునే గుణమే ఆమెకు ప్రత్యేక గుర్తింపునిచ్చింది. సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా ప్రజలతో నిత్యం సంపర్కంలో ఉంటూ, తన కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేశారు.







## రాజకీయ మలుపు.. కాంగ్రెస్‌లోకి అడుగు

2024 జులైలో కోరుట్ల రాజకీయాల్లో కీలక మలుపు చోటు చేసుకుంది. అన్నం లావణ్య అనిల్ దంపతులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారితో పాటు ఆరుగురు కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్‌లో చేరడం ద్వారా మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు మారాయి. గాంధీ భవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ చేరిక రాష్ట్ర రాజకీయాల్లోనూ చర్చనీయాంశమైంది. ఈ మార్పు అనంతరం ఆమెను కాంగ్రెస్ పార్టీలో కోరుట్ల నియోజకవర్గంలో కీలక నేతగా చూస్తున్నారు.

రాజకీయ ప్రవేశం..

## చైర్‌పర్సన్‌గా బాధ్యతాయుతమైన పాలన

ఇక.. కోరుట్ల మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసి 'ఏకగ్రీవం'గా గెలిచిన అన్నం లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2020 నుంచి 2024 వరకు ఆమె పాలన కాలంలో పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. హరితహారం కార్యక్రమాల్లో భాగంగా దేవాలయాలు, రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటించి, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. అప్పటి జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు వంటి అధికార, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేస్తూ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.



## అభివృద్ధి దిశగా అడుగులు

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఆమె పాలనలో బీటీ రోడ్లు, అర్బన్ కాలనీల అభివృద్ధి, వాణిజ్య కేంద్రాల ప్రారంభాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం లభించింది.'మినీ ట్యాంక్ బండ్' వంటి భౌతిక అభివృద్ధి పనులతోపాటు.. ఐటీ హబ్ సేవల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల కోసం 'ఆకృతి సారి సెంటర్' వంటి స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ప్రారంభించి, ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయించారు. బతుకమ్మ, మహిళా దినోత్సవ వేడుకల్లో చురుకుగా పాల్గొంటూ, మహిళా సాధికారతకు తనవంతు కృషి చేశారు.

## 26వ వార్డు ప్రజలతో భావోద్వేగ బంధం..

### మరోసారి ఆశీర్వాదం కోరిన నేత

గతంలో కోరుట్ల మున్సిపాలిటీలోని 26వ వార్డు నుంచి ఏకగ్రీవంగా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని చాటుకున్న అన్నం లావణ్య-అనిల్' ఈసారి కూడా అదే వార్డు ప్రజల మద్దతుతో గెలవాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రజలే తన బలమని, వారి ఆశీర్వాదంతోనే రాజకీయంగా ఎదిగానని పలుమార్లు పేర్కొన్న ఆమె, మరోసారి అవకాశం ఇస్తే వార్డులో మరింత అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. గత పాలనలో ప్రారంభమై అసంపూర్తిగా మిగిలిన అభివృద్ధి పనులను పూర్తిచేయడం, మౌలిక వసతుల బలోపేతం, డ్రైనేజీ--రోడ్ల సమస్యల శాశ్వత పరిష్కారం, మహిళలు-యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటామని తెలిపారు. "26వ వార్డు నా రాజకీయ జీవితానికి పునాది. మీ ఓటు, మీ ఆశీర్వాదం మరోసారి లభిస్తే... ఈ వార్డును అభివృద్ధిలో ముందుండేలా చేస్తాను" అని ఆమె ప్రజలకు భరోసా ఇచ్చారు.!!